KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 సంచిక 265 | బుధవారం 27 ఆగస్టు 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-

## హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం..

### 50 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్




హైదరాబాద్ నగరంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేగింది. 50 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్టు అధికారులు తెలిపారు. కిలోన్నర గంజాయి, 47 గ్రాముల ఓజీ వీడ్ ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మల్నాడు రెస్టారెంట్ యజమాని ఇచ్చిన సమాచారంతో పోలీసులు మహీంద్రా యూనివర్సిటీలో నార్కోటిక్ పోలీసులు సోదాలు నిర్వహించారు.

## నాలుగుసార్లు ట్రంప్ ఫోన్ కాల్‌ను కట్ చేసిన మోడీ ?

### జర్మన్ పత్రిక కథనంతో కలకలం

న్యూఢిల్లీ,ఆగస్టు26(క్రాంతిన్యూస్):అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన నాలుగు ఫోన్ కాల్స్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించలేదని, వాటిని ఆయన తిరస్కరించారని జర్మనీలో ప్రచురితమైన కథనంలో పేర్కొనడం హాట్‌టాపిక్‌గా మారింది. ప్రముఖ జర్మన్ పత్రిక 'ఫ్రాంక్‌ఫర్టర్ ఆల్గెమైన్' ఇటీవల ప్రచురించిన ఈ కథనం ప్రకారం, మోదీ వ్యవహారం అమెరికాపై నిరసన వ్యక్తీకరణగా అభివర్ణించబడింది.వాణిజ్య, భద్రత, అంతర్జాతీయ సంబంధాల నేపథ్యంలో ఇది పెద్ద అంశంగా తెరపైకి వచ్చింది.



## "అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్దాం"

## కాంగ్రెస్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా..!

### బండి సంజయ్ ఘాటు సవాల్



- పీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్ర మంత్రి
- ఓటర్లను అవమానించకండి ప్రజల తీర్పును గౌరవించండి
- దొంగ ఓట్ల ఆరోపణలు తప్పుడు ప్రచారం అంటూ ఖండన
- రోహింగ్యాలకు ఓటర్ ఐడీలు ఎవరు ఇచ్చారు?- సంజయ్ ప్రశ్న

హైదరాబాద్ ,26 ఆగస్టు ( క్రాంతిన్యూస్ ):

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మద్దతుతో అధికారంలోకి రాలేదని, అసెంబ్లీని వెంటనే రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ప్రజలు మళ్లీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సంచలన ప్రకటన చేశారు.

# 30న అసెంబ్లీ సమావేశాలు

### అదేరోజు కీలక మంత్రివర్గ భేటీ

- ఆగస్టు 30 నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాలు ప్రారంభం
- మండలి సమావేశాల మొదటిరోజే కీలక మంత్రివర్గ భేటీ
- బీసీలకు 42% రిజర్వేషన్‌పై స్థానిక సంస్థల ఎన్నికల చర్చ
- కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో హాట్ డిబేట్
- డిప్యూటీ స్పీకర్‌గా రాంచందర్ నాయక్ ఎన్నికకు ఏర్పాట్లు
- 2023 తర్వాత తొలిసారిగా శాసనసభలో పూర్తి సమావేశాల షెడ్యూల్
- ప్రతిపక్షాల నుంచి పీసీ ఘోష్ నివేదికపై ప్రభుత్వం కౌంటర్‌కు సన్నద్ధం
- విధాన పరంగా కీలక నిర్ణయాలకు తెర లేపే అవకాశం



తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ఆమోదంతో అసెంబ్లీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 10:30 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో పాలక, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్రమైన చర్చలు సాగనున్నట్లు రాజకీయ వర్గాల్లో అంచనాలు మొదలయ్యాయి.అసెంబ్లీ ప్రారంభమైన అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో జరిగే ఈ భేటీలో రాష్ట్రంలో ఎదురవుతున్న కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

### సర్పంచ్ ఎన్నికల తుది ఓటర్ల జాబితా విడుదలకు

# ఈసీ నోటిఫికేషన్ విడుదల

- సర్పంచ్ ఎన్నికలకు వేగం పట్టిన రాష్ట్ర ఎన్నికల కమిషన్
- తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ జారీ
- సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితా అందుబాటులోకి
- ఆగస్టు 28న మొదటి జాబితా పంచాయతీ కార్యాలయాల్లో ఉంచాలి
- ఆగస్టు 29న రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశం
- ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం
- ఎంపీడీవోలు, పార్టీ ప్రతినిధులతో మండల స్థాయి సమావేశాలు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కీలక ఆదేశాలు జారీ





హైదరాబాద్ ,26 ఆగస్టు ( క్రాంతిన్యూస్ ):

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వేగవంతం చేసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అన్ని పార్టీలు కూడా ఎన్నికలకు సన్నద్ధం కావడంతో ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికలను కసరత్తును ప్రారంభించింది. త్వరలో ప్రారంభమయ్యే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఫైనల్ ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కసరత్తను వేగవంతం చేసింది.

## "బీజేపీలో నాతో ఫుట్‌బాల్ ఆడుతున్నారు!"

చంద్రశేఖర్ తివారీకి ఫుట్‌బాల్ అందజేసి అసంతృప్తి చాటిన ఎంపీ కొండా



## 1,600 ఏళ్లనాటి చతుర్ముఖ నందీశ్వర లింగం వెలుగులోకి



## మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు నమోదు

### రెచ్చగొట్టే వ్యాఖ్యలు.. - ఏలూరులో ఎఫ్ఐఆర్




హైదరాబాద్,26ఆగస్టు(క్రాంతిన్యూస్):

రెండు వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా, పోలీసుల పరువు నాశనం చేసేలా చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని)పై కేసు నమోదైంది. ఈ మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎఫ్ఐఆర్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. దెందులూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసును నమోదు చేశారు.

## నేటి మాట

"సమస్యను మనమే సృష్టిస్తే, దానికి పరిష్కారం కూడా మనకే తెలుసు!"



అల్బర్ట్ ఐన్‌స్టీన్

## రాష్ట్రానికి రెయిన్ అలర్ట్

- బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం
- నాలుగు రోజులు భారీ వర్షాలు
- హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



హైదరాబాద్,26ఆగస్టు(క్రాంతిన్యూస్)

తెలుగు రాష్ట్రాల్లో మరోసారి వర్షాలు చెలరేగనున్నాయి. ఆగస్టు మొదటి వారం నుంచి దాదాపు పది రోజులు వరుసగా కురిసిన వానలు, కొన్నిరోజుల విరామం తర్వాత మళ్లీ తళుక్కుమన్నాయి. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడటంతో రాబోయే నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



మన క్రాంతి KR TV ఇది వాస్తవ పత్రిక...



# రాష్ట్రానికి బిగ్ రెయిన్ అలర్ట్

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే గత వర్షాలతో తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలు భారీగా నష్టపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి జిల్లాలు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో వాగులు వంకలు పొంగిపోయాయి. ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను ఆనుకొని ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రెండు రాష్ట్రాల్లో విస్తృత వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

హైదరాబాద్ నగరంలో కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, నానక్‌రాం గూడ, గోల్కొండ, అత్తాపూర్ ప్రాంతాల్లో ఈ రోజు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాత్రికి వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, ములుగు, భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

రేపు భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు ఉండబోతున్నాయి. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం తెలంగాణలోని ఎక్కువ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో మళ్లీ భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని వాతావరణ శాఖ సూచించింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ అయ్యాయి.

## సర్పంచ్ ఎన్నికలతుది ఓటర్ల జాబితా విడుదలకు ఈసీ నోటిఫికేషన్ విడుదల

మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాలు, ఫైనల్ ఓటర్ల జాబితా విడుదలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 2వ తారీఖున గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 28న గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఆగస్టు 29న జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు.

ఆగస్టు 30న మండల స్థాయిలో ఎంపీడీవోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 28 నుండి 30 వరకు తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనున్నారు. వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరించనున్నారు. సెప్టెంబర్ 2వ తారీఖును అధికారులు ఓటర్ల ఫైనల్ జాబితాను రిలీజ్ చేయనున్నారు.

## మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి

పెదవేగి మండలం కొండలరావుపాలెం గ్రామంలో ఈ నెల 22న జరిగిన సంఘటనను కొనసాగింపుగా వైకాపా నేతలు ఏలూరు ఎస్పీ కార్యాలయానికి చేరుకుని అదనపు ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన పేర్ని నాని తన ప్రసంగంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని చంపుతారా? చంపితే నియోజకవర్గంలో వెయ్యి మంది అబ్బయ్య చౌదరిలు పుడతారు" అంటూ చేసిన వ్యాఖ్యలు సామాజిక వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. ఆయన చేసిన వ్యాఖ్యలు స్థానికంగా వర్గీయ ఉద్రిక్తతకు దారితీసేలా ఉన్నట్లు పోలీసులు అభిప్రాయపడ్డారు. శాంతి భద్రతలకే ముప్పుగా మారేలా వ్యవహరించారని తెలిపారు.

ఈ నేపథ్యంలో పేర్ని నానిపై ఐపీసీ 153(ఏ), 504, 505(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో వర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు, ఇతరులను ఉద్దేశపూర్వకంగా అవమానించే వ్యాఖ్యలు, సామాజిక విభజనకు దారితీసే ప్రచారాలను అడ్డుకునే నిబంధనలు ఉన్నాయి. పోలీసులు ప్రస్తుతం కేసును దర్యాప్తు దశలో ఉంచారు. కాగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ ఘటనపై ఇంకా అధికారికంగా స్పందించలేదు. అయితే స్థానికంగా వైకాపా కార్యకర్తలు మాత్రం నాని వ్యాఖ్యలు వాస్తవ పరిస్థితులకే ప్రతిబింబమని చెబుతున్నారు. మరోవైపు ప్రతిపక్ష టీడీపీ నేతలు మాత్రం ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే రాజకీయ విభేదాలు తారాస్థాయికి చేరిన వేళ, ఈ వ్యాఖ్యలు మరింత వివాదాలకు దారి తీసే అవకాశముందని భావిస్తున్నారు. ఈ కేసు పేర్ని నానిపై అరెస్ట్‌కు దారితీస్తుందా అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. కేసును పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు భంగం కలిగించే ఎలాంటి చర్యలైనా చట్టపరమైన గమ్యం తప్పదని హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం..

మొదటిపేజీ తరువాయి



శ్రీ మారుతి కొరియర్ ద్వారా ఢిల్లీ నుంచి డ్రగ్స్ సరఫరా జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. గతంలో నైజీరియన్ నిక నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి పలు పబ్ లలో విద్యార్థులు పార్టీలు చేసుకున్నట్టు తెలిపారు. డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి సేవిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూనివర్సిటీలో విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ కు బానిసలు అవుతున్నారని తెలంగాణ యాంటీ నార్కోటిక్ అధికారులు తెలిపారు. ఆషార్ జావేద్, గణేష్, శివకుమార్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# నాలుగుసార్లు ట్రంప్ ఫోన్ కాల్‌ను కట్ చేసిన మోడీ ?

మొదటిపేజీ తరువాయి

ట్రంప్ పాలనలో భారత్–అమెరికా సంబంధాలు అనేక సార్లు ఒడిదుడుకులకు గురయ్యాయి. ముఖ్యంగా ట్రంప్ ప్రభుత్వం విధించిన అధిక టారిఫ్‌లు, ఇండియాకు వ్యతిరేకంగా తీసుకున్న వాణిజ్య నిర్ణయాలు ఈ సంబంధాల్లో ఉద్రిక్తతకు కారణమయ్యాయి. అమెరికా ఒక వైపు పాకిస్తాన్‌కు మద్దతుగా వ్యాఖ్యలు చేస్తూ, మరోవైపు భారత్‌ను గట్టిగా ప్రెస్ చేయడంపై నరేంద్ర మోదీ అసంతృప్తిగా ఉన్నారని పత్రిక పేర్కొంది.

పాక్‌తో చమురు ఒప్పందాల దిశగా అమెరికా ఆసక్తి చూపిన నేపథ్యంలో, భారత్‌కు మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతులపై గీతలు వేయడం మోదీని అసహనానికి గురిచేసినట్టుగా ఆ కథనంలో పేర్కొంది. నాలుగు సార్లు ట్రంప్ ఫోన్ చేసినప్పటికీ, మోదీ స్పందించకపోవడం ఆయన స్పష్టమైన అసంతృప్తిని వెల్లడిస్తోందని జర్మన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

అమెరికా తరచూ తానే ప్రపంచ నాయకత్వం వహిస్తున్నట్టు మోస్తున్న ధోరణి గురించి పలు దేశాల్లో విమర్శలు వెలువడుతున్నాయి. "ఇతరుల్ని సూచించడమే తప్పు, తమ తప్పుల్ని గుర్తించని రీతిని అమెరికా ప్రదర్శిస్తోంది," అనే వాదన జర్మన్ మీడియా నుంచి వస్తోంది.

అంతేకాక, భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం తన విజయం అంటూ ట్రంప్ ఒక సందర్భంలో గర్వంగా చెప్పుకోవడం మోదీకి ఇష్టపడని అంశంగా పేర్కొంది. దీనిపై ఎటువంటి పబ్లిక్ రియాక్షన్ ఇవ్వకుండా మోదీ, ట్రంప్ కాల్‌లను నిర్లక్ష్యం చేయడం తన అసంతృప్తికి ప్రతీకగా అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఇది నిజంగా జరిగిందా లేక ప్రచారమేనా అన్నది అధికారికంగా ఖరారు కాలేదు. కానీ నాలుగు ఫోన్ కాల్స్ నిర్లక్ష్యం చేయడం అనే అంశం ప్రపంచ మీడియాలో చర్చనీయాంశమవుతోంది. మోదీ నిర్ణయం అమెరికా ఒత్తిడికి తలొగ్గకపోవడం అనే సంకేతంగా పలువురు విశ్లేషిస్తున్నారు.

ఈ అంశంపై భారత ప్రభుత్వం స్పందించకపోయినా, జర్మన్ మీడియాలో వచ్చిన కథనం వల్ల ఈ విషయంపై కొత్త చర్చ మొదలైంది. అటు ట్రంప్ ఎందుకు అంతగా ఫోన్ కాల్స్ చేశారన్నది, ఇటు మోదీ ఎందుకు స్పందించలేదన్నది – ఇంకా స్పష్టతకు నోచుకోలేదు. కానీ ఈ ఘటన, భారత్ తన అంతర్జాతీయ నైతికతను ఎలా నిలబెట్టుకుంటుందో చూపించే ఉదాహరణగా నిలుస్తుందా? అనేది ఇప్పుడు ప్రపంచం గమనిస్తున్న ప్రశ్నగా మారింది.

## 1,600 ఏళ్లనాటి చతుర్ముఖ నందీశ్వర లింగం వెలుగులోకి

హైదరాబాద్ చైతన్యపురిలోని కొసగుండ్ల నరసింహ స్వామి దేవాలయంలో ఒక పురాతన చతుర్ముఖ నందీశ్వర లింగం వెలుగులోకి వచ్చింది. చరిత్రకారుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ ఆదివారం దీన్ని గుర్తించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురి ప్రాంతం సుమారు 1,600 ఏళ్ల క్రితం నిర్మించిన గోవిందరాజు విహార అనే హీనయాన బౌద్ధ విహారాన్ని సూచించే శాసనంతో ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం ఆ విహార స్థలాన్ని ఫణిగిరి కొసగుండ్ల నరసింహ స్వామి దేవాలయంగా పిలుస్తున్నారు.ఆ దేవాలయం వెనుక శిథిలాల్లో నందీశ్వర లింగం లభించింది. దాదాపు 2 అడుగుల చదరపు రాతి స్లాబ్‌పై, 4 దిక్కుల్లో ఒక్కోటి 8 అంగుళాల పరిమాణంలో నందులు, వాటి మ?ధ్యలో శివలింగం, దాని చుట్టూ అభిషేక జలాన్ని బయటకు పంపే పానవట్టం చెక్కారు. ఇది దేశంలోనే అతి ప్రాచీన, అరుదైన లింగం అని సత్యనారాయణ తెలిపారు.

# 30నఅసెంబ్లీ సమావేశాలు



మొదటిపేజీ తరువాయి


ఈ సమావేశాల్లో అత్యంత ప్రాధాన్యత పొందుతున్న అంశం – బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయింపుతో కూడిన స్థానిక సంస్థల ఎన్నికలు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల నిర్వహణ, సీట్ల రిజర్వేషన్, నోటిఫికేషన్ ప్రక్రియ మొదలైన అంశాలపై మంత్రివర్గం లోతుగా చర్చించనుంది.

ఇక అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ప్రవేశపెట్టడం మరో ముఖ్యాంశం. ఈ నివేదికలో పేర్కొన్న లోపాలు, ఆర్థిక వ్యయాలు, వ్యవస్థాపక తప్పిదాలపై సభలో చర్చ జరగనుంది. అన్ని పార్టీల అభిప్రాయాలను సేకరించి, తదుపరి చర్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వనుంది.

మరోవైపు, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కూడా ఈ సమావేశాల్లోనే నిర్వహించే అవకాశముంది. గత డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగానే ఉంది. అప్పటి నుంచి ప్యానెల్ స్పీకర్లు మాత్రమే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్‌ను డిప్యూటీ స్పీకర్‌గా ఎంపిక చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో 30న జరిగే మొదటి సభలోనే ఆయన ఎన్నిక ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉంది.రాష్ట్ర రాజకీయాల్లో అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడూ కీలక మలుపులకు కారకమవుతాయి. ఈసారి కూడ నియోజకవర్గాల్లో జరుగుతున్న ఉద్యమాలు, అభివృద్ధి అంశాలపై ప్రభుత్వం తీసుకునే వైఖరి, ప్రతిపక్షాల వ్యూహాలు సభ వేదికపై స్పష్టతకు వస్తాయని విశ్లేషకుల అంచనా. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొలిసారిగా పెద్ద మొత్తంలో సమావేశాలు జరగడం, ప్రజాప్రతినిధుల నుంచి తగిన స్థాయిలో చర్చలు, ప్రశ్నోత్తరాలపై ప్రజల దృష్టి ఉంది.

## "బీజేపీలో నాతో ఫుట్‌బాల్ ఆడుతున్నారు!"

**-చంద్రశేఖర్ తివారీకి ఫుట్‌బాల్ అందజేసి అసంతృప్తి చాటిన ఎంపీ కొండా**



బీజేపీ లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తన పార్టీ నేతలపై అసహనం వ్యక్తం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యకలాపాలు సరిగా సాగడంలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి వచ్చినపుడు చేతిలో ఫుట్‌బాల్ పట్టుకుని రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం మంగళవారం ఉదయం ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ తివారీని ప్రత్యక్షంగా కలిశారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీలో అంతర్గత అనిశ్చితి, సమన్వయ లోపాలపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఆయనకు?ధార్ణాత్మకంగా ఫుట్‌బాల్ అందించారు. "నాతో పార్టీ ఫుట్‌బాల్ ఆడుతోంది!" అనే సందేశం ఇమ్మెడియట్‌గా ప్రచారంలోకి వచ్చింది.

ఈ చర్యతో అకస్మాత్తుగా కంగారుపడిన తివారీ, కొండాతో ప్రత్యేకంగా సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. ఇందులో భాగంగా రంగారెడ్డి రూరల్ మరియు వికారాబాద్ జిల్లాల్లో బీజేపీ నేతలు సక్రమంగా వ్యవహరించడంలేదన్న విషయాన్ని కొండా వివరించినట్టు సమాచారం.

ఈ అంశంపై మాట్లాడిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తనకు పార్టీలో ఎటువంటి అసంతృప్తి లేదని తేల్చిచెప్పారు. "కొంతమంది కావాలనే తప్పుదోవ పట్టించే ప్రచారం చేస్తున్నారు," అంటూ వ్యాఖ్యానించారు.

అయితే, ఆయన బాడీ లాంగ్వేజ్, ఫుట్‌బాల్ వినియోగం ద్వారా తన అసహనం వ్యక్తపరిచిన తీరు బీజేపీ అంతర్గతంగా ఓ మైలురాయిగా మిగిలే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## "అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్దాం"

# కాంగ్రెస్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా..!

మొదటిపేజీ తరువాయి



అధికార పార్టీపై తీవ్రమైన విమర్శలు చేస్తూ కాంగ్రెస్ నేతలకు నేరుగా సవాల్ విసిరారు. "నిజంగా మీకు బలం ఉంటే ముందుకు రండి, అసెంబ్లీ రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉంటారా?" అంటూ ప్రశ్నించారు.

కరీంనగర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడిన బండి సంజయ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన "దొంగ ఓట్లు వేసి భాజపా ఎంపీలు గెలిచారు" అనే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఓటర్లను అవమానించేలా, ప్రజల తీర్పును అపహాస్యం చేసేలా ఉన్న ఆ వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. "కరీంనగర్‌లో ఓటేసిన ఓటరు, జగిత్యాలలో మరో ఓటు, చొప్పదండిలో ఇంకో ఓటు వేసినట్టు ఎలా సాధ్యం అవుతుంది? నన్ను 2.25 లక్షల మెజార్టీతో గెలిపించిన ప్రజల పట్ల మీరు ఇలా అనడం తగదు" అని వ్యాఖ్యానించారు.తాను గెలిచిన 8 పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజలను అవమానించే విధంగా పీసీసీ అధ్యక్షుడు వ్యాఖ్యానించారని ఆయన అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలన్నారు. దొంగ ఓట్ల ఆరోపణలు నిజమైతే, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని బండి సంజయ్ ప్రశ్నించారు.స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నది అభివృద్ధి కోసమేమీ కాదని, కేంద్ర నిధులు పొందాలనే ఉద్దేశంతో మాత్రమే కాంగ్రెస్ పట్టుదల చూపుతోందని విమర్శించారు. ఓటు బ్యాంకు కోసం రోహింగ్యాలాంటి విదేశీ ప్రవాసులకు ఓటరు కార్డులు, రేషన్ కార్డులు, ఇళ్లను ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్నదెవరు? అని సంజయ్ ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన మరో ఆసక్తికర వ్యాఖ్య చేశారు. "నన్ను గెలిపించిందీ పెద్దలే అయినా... ఓటు వేసే పని పిల్లలే చేయించారు. అందుకే వారికోసం ఏదైనా చేయాలన్న దృక్పథంతోనే సైకిళ్లను పంపిణీ చేస్తున్నా," అని చెప్పారు. మంగళవారం మానకొండూర్ నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 'మోదీ గిఫ్ట్'గా సైకిళ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో తాడికల్ గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని తన తల్లిదండ్రులు దరిద్రమే జీవితం అని, సైకిల్ తన చదువుకు చాలా ఉపయోగపడుతుందని భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకుంది. ఆ విద్యార్థినిని బండి సంజయ్ ఓదార్చుతూ, "నీ భవిష్యత్తు తలంచుకొని ప్రభుత్వానికి దీటుగా మేము కూడా పని చేస్తాం" అని హామీ ఇచ్చారు.

# ఉపాధి బిల్లులపై లంచం డిమాండ్

సిద్దిపేట జిల్లా మద్దూరు మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న ఈసీ బండకింది పర్శ రాములు లంచం తీసుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మండలంలో చేసిన 213 ఉపాధి హామీ పనులను టెక్నికల్ అసిస్టెంట్ రికార్డు చేశాడు. అలా పనుల రికార్డులకు ఒక్కోదానికి రూ.200 చొప్పున సర్కారు చెల్లిస్తుంది. 213 పనుల రికార్డులకు రూ.42,500 బిల్లు వస్తుండటంతో వాటిని ప్రభుత్వామోదానికి పంపేందుకు ఈసీ పర్శరాములు రూ.11,500 లంచం అడిగాడు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు.. వారి సూచన మేరకు మంగళవారం కార్యాలయంలోనే పర్శ రాములుకు రూ.11,500 డబ్బు చెల్లించాడు. అక్కడే మాటు వేసిన ఏసీఈ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పర్శరాములును పట్టుకున్నారు.

# రైతు బిడ్డను అని చెప్పుకునే ముఖ్యమంత్రి

# రైతులకు సాగునీరు ఇవ్వడంలో విఫలం



మోత్కూర్ 26ఆగస్టు (క్రాంతి న్యూస్): నిన్న ముఖ్యమంత్రి ఉస్మానియా యూనివర్సిటీలో మాట్లాడిన తీరు రెండు సంవత్సరాల కాలంలో తను చేసింది చెప్పడానికి ఏమిలేక. రానున్న కాలంలో ఏమి చేయాలో అర్థం గాక నీవ్వు ఎంత మానసిక ఒత్తిడిలో ఉన్నావో విద్యార్థులకు తెలంగాణ ప్రజలకు అర్థమయిందని మోత్కూర్ మార్కెట్ కమిటీ మాజీ చేర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు నువ్వేమో కుళేశ్వరం అంటావ్, నీ మంత్రులేమో అదే కుళేశ్వారా నీళ్లను వదలడానికి హెలికాప్టర్ లో తిరుగుతారు.మీ ఏమ్మెల్యే లు ఆనీళ్ల కుహరతులు ఇస్తారు. రైతు బిడ్డను అని చెప్పుకునే ముఖ్యమంత్రి రైతులకు సాగునీరు ఇవ్వడంలో ఎందుకు విఫలం అయ్యారని అన్నారు సకాలంలో యూరియా ఎందుకు అందివ్వడం లేదన్నారు.పార్టీ మీటింగ్ అయిన. ప్రభుత్వ పోగ్రామ్ అయిన. చివరికి విద్యార్థులతో మాట ముచ్చట అయిన కెసిఆర్ తిట్టడం తప్పా నువ్వు కొత్తగా సాధించింది ఏమి లేదన్నారు.గోర్లు.బర్లు. చేపల పెంపకందార్లను నిన్న నువ్వు అన్నమాట కించపరిచే విదంగా ఉన్నాయన్నారు నీ మనుమనికి తాగటానికి పాలు. నువ్వు తినడానికి మాంసం. నీ మంత్రులకు చేపలపులుసు కావాలె గాని వాటి పెంపకం దార్లంటే నీకు చులకనఎందుకన్నారు.వారందరు బిసి లే అని గుర్తుపెట్టుకోవాలన్నారు.గత పది సంవత్సరాల కాలంలో రైతులకు ఏ ఒక్కరోజు రాని యూరియా కష్టం ఇప్పుడఎందుకు వచ్చింది అన్నారు.మీఅసమర్ధతే దీనికి కారణమని తెలంగాణ రాష్ట్రంలో ఉస్మానియా విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు వారికి తెలుసన్నారు. వచ్చే ఎన్నికల్లోవారే నీకు రాజకీయ సమాధి చేయడం ఖాయమన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



ఆత్మకూర్ 26ఆగస్టు(క్రాంతి న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం, కొరటికల్ గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత మండలంలోని కొరటికల్ గ్రామ మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం తండ్రి పెండెం లక్ష్మీనారాయణ ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనంతరం బిఆర్ఎస్ నాయకులు కట్టేకోల ప్రభాకర గౌడ్ ప్రమాదవశాత్తు మరణించగా వారి నివాసానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు..

వారితో పాటు తాజ మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్, యాస ఇంద్రా రెడ్డి, కోరే బిక్షపతి, బీఆరెస్వి మండల అధ్యక్షులు చుంచు నాగరాజు, మహేశ్వరం మధుసూదన్, బెజ్జరబోయిన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు..



## పర్యావరణ స్పృహను పెంపొందించిన ఎకో -వినాయక విగ్రహాల ప్రతిమలు



పటాన్ చెరు, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): పర్యావరణ అనుకూల గణేష్ విగ్రహ తయారీ కార్యక్రమాన్ని గీతం, హైదరాబాదులోని ఉమెన్ లీడర్స్ ఫోరం (డబ్ల్యూఎల్ఎఫ్) మంగళవారం నిర్వహించింది. కృత్రిమ రంగులు లేదా రసాయనాలు లేకుండా సహజ పదార్థాలతో విగ్రహాలను తయారుచేసి తమ పర్యావరణ స్పృహను చాటుకున్నారు. అందుకు అవసరమైన బంక మట్టి, విత్తనాలను వారు విద్యార్థులకు అందజేశారు. సాంప్రదాయ పూజ తరువాత, ఈ విగ్రహాలను నివాస ప్రాంగణాలు లేదా తోటలలో నిమజ్జనం చేసేలా రూపొందించారు. ఈ కాలుష్య రహిత అభ్యాసం, పర్యావరణాన్ని కూడా పెంపొందిస్తుంది.దీనికి సమాంతరంగా,రుద్రారంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సంస్కృతి, అన్వేషణ అనే గీతం విద్యార్థి విభాగాలు, పర్యావరణ హిత గణపతి విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని చేపట్టాయి. రెండు కార్యక్రమాలలో వందేసి మంది చొప్పున విద్యార్థులు పాల్గొని, హరిత సందేశాన్ని మరింత వ్యాప్తి చేశారు. వినూత్న కార్యక్రమాన్ని సందేశాత్మకంగా చేపట్టిన విద్యార్థి బృందాల అధ్యక్షులు, సభ్యులను గీతం ఉన్నతాధికారులు ప్రశంసించారు

## మండపాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

### ములుగు జిల్లా ఎస్పీ డా.శబరిష్.పి



ములుగు జిల్లా ప్రతినిధి, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): ములుగు జిల్లా కేంద్రం లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ డా.శబరిష్.పి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్స్ గురించి ఆరా తీసి, వారిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉండాలని, వారి వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు.ముఖ్యంగా వినాయక చవితి సందర్భంగా జిల్లాలో విగ్రహాలు ప్రతిష్టించే ప్రతి ఒక్కరు కూడా ఆన్లైన్ దరఖాస్తు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే మండపాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా చూడాలని అన్నారు. అలాగే విగ్రహాల ఏర్పాటు అనంతరం వాటిని జియో టాగింగ్ చేయాలని సూచించారు. మండపాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ కావలసిన ఏర్పాట్లు ముందుగానే చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ ఐపీఎస్, ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్ బి ఇన్స్పెక్టర్ శంకర్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ కుమార్, సిఐ ఏటూరునాగారం శ్రీనివాస్ , సిఐ ములుగు సురేష్, సిఐ వెంకటాపురం రమేష్, సిఐ పస్రా దయాకర్, ఎస్ఐ ములుగు వెంకటేశ్వరరావు, ఎస్ఐ వెంకటాపూర్ రాజు, ఎస్ఐ పస్రా కమలాకర్, ఎస్ఐ తాడ్వాయి శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐ ఏటూరునాగారం రాజ్ కుమార్, ఎస్ఐ మంగపేట సురేష్, ఎస్సై కన్నాయిగూడెం వెంకటేష్, ఎస్ఐ వాజేడు సతీష్ , ఎస్ఐ పేరూరు కృష్ణ ప్రసాద్, ఎస్సై వెంకటాపురం తిరుపతి, డిసిఆర్బి ఎస్సై జగదీష్ ఐటీ కోర్ టీం, డిసిఆర్బి సిబ్బంది పాల్గొన్నారు.

## బిక్కేరు వాగులో పడి వ్యక్తి మృతి



ఆత్మకూర్ 26ఆగస్టు(క్రాంతి న్యూస్) : ఆత్మకూరు(ఎం) మండలంలోని పారుపల్లి గ్రామ మోత్కూరు మోదుబావి గూడెం మధ్య ప్రవహిస్తున్న బిక్కేరు వాగులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఆలేరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన చిర్ర బాలయ్య (55) పండుగ కోసం ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లిలోని అత్తగారి ఇంటికి వెళుతున్నాడు. ఆలేరు నుంచి మోత్కూర్ వచ్చి పారుపల్లి బిక్కేరు వాగులో చెక్ డ్యాం మీదుగా వెళుతుండగా ప్రమాదవశాత్తు జారి నీళ్లలో పడి పోయాడు. అతనికి ఈత రాకపోవడంతో మృతి చెందాడు. ఉదయం వాగులో శుభం పైకి తేలడంతో గ్రామస్తులు గమనించి సమాచారం అందించారు. గుండాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు.

# విద్య-పరిశ్రమ భాగస్వామ్యంతోనే నైపుణ్యం సాధ్యం

### ▶▶ గీతం ఫార్మసీ కార్యక్రమంలో నిపుణులు ▶▶ ఆ సంస్థల మధ్య అంతరం తగ్గాలని సూచన



పటాన్ చెరు, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ఫార్మసీ నిపుణులను రూపొందించడంలో విద్యా-పరిశ్రమ భాగస్వామ్యాలు ఎంతో అవసరమని, వాటి మధ్య అంతరం తగ్గినప్పుడే నైపుణ్యం వెలికి వస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. భారతీయ సొసైటీ ఫర్ క్లినికల్ రీసెర్చ్ (ఐఎస్ సీఆర్) సహకారంతో హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'ఫార్మకోవిజిలెన్స్(పీవీ)లో ఇటీవలి పరిణామాలు, కెరీర్ అవకాశాలు' అనే అంశంపై మంగళవారం పరిశ్రమ-విద్యా సంస్థల ముఖాముఖి నిర్వహించారు. జాతీయ ఫార్మకాలజీ దినోత్సవ వేడుకలలో భాగంగా,అభివృద్ధి చెందుతున్న ఫార్మకోవిజిలెన్స్ రంగం, దానిలో పెరుగుతున్న కెరీర్ సామర్థ్యాన్ని చర్చించడానికి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం విద్యార్థులు,అధ్యాపకులు,పరిశ్రమ నిపుణులను ఒకచోట చేర్చింది. సాంకేతిక ఆవిష్కరణలు, నియంత్రణ, నవీకరణలపై ఫార్మకోవిజిలెన్స్ (భారతదేశం) సీనియర్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్ కందుల ప్రసంగించారు. ఫార్మకోవిజిలెన్స్ లో విశ్వవ్యాప్తంగా ఉన్న విభిన్న కెరీర్ అవకాశాలను ఓవియా మెడ్ సేఫ్ ఎండీ, ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ జె.విజయ్ వెంకట్రామన్ వివరించారు.ఇండియన్ సొసైటీ ఫర్ క్లినికల్ రీసెర్చ్ (ఐఎస్ సీఆర్) యొక్క చొరవలను, క్లినికల్ పరిశోధనలో వృత్తిపరమైన అవకాశాలను ఐఎస్ సీఆర్ పీవీ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ బబితా కిరోడియన్ విశదీకరించారు.క్లినికల్ పరిశోధనలో ఉన్న కష్టనష్టాలు, కెరీర్ అవకాశాలను క్లినిసోల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ముజీబుద్దీన్ వివరించారు.తొలుత గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథులను ఆహ్వానించి సత్కరించగా,కార్యక్రమ సమన్వయకర్తలు డాక్టర్ ప్రియా సింఘా, డాక్టర్ పూజా మిట్టల్ ల వందన సమర్పణతో ముగిసింది. విద్యా సంస్థ, పరిశ్రమ మధ్య వారధిని బలోపేతం చేయడం, ఔషధ భద్రత, ఆరోగ్య సంరక్షణలో తదుపరి తరం నాయకులకు మార్గనిర్దేశనం చేసిన ఈ కార్యక్రమంలో ఫార్మసీ అధ్యాపకులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ విన్యాస్, డాక్టర్ సతీష్, డాక్టర్ రాకేష్ బారిక్,డాక్టర్ భాస్కర్, బి.ఫార్మసీ,ఎం.ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.



## జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గా సూదగాని హరికృష్ణ గౌడ్



మోత్కూర్ 26ఆగస్టు(క్రాంతి న్యూస్):జాతీయ మానవహక్కుల కమిటీ యాదాద్రి భువనగిరి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గా గుండాల మండలానికి చెందిన సూదగాని హరికృష్ణ గౌడ్ నియమిస్తూ జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు యేల్లంల శ్రీధర్ రెడ్డి మంగళవారం నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షులు యం.డి యాసీన్ (అడ్వకేట్) రాష్ట్ర అధ్యక్షులు బద్దిపడిగ శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మానవ హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లా జితేందర్ రెడ్డి, పవన్, సాయి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రానికి భారీ విరాళం

**-మాజీ మంత్రులు,గంగుల కమలాకర్,జోగు రామన్నలతో కలిసి రూపాయలు 10 లక్షల చెక్కు అందజేసిన: ఎంపీ రవిచంద్ర**



వరంగల్, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రులు గంగుల కమలాకర్,జోగు రామన్నలతో కలిసి చదువులతల్లి సరస్వతి అమ్మ వారు కొలువైన బాసరలో మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రానికి రూ.10లక్షల చెక్కు అందించారు.నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఈసత్రాన్ని నెలకొల్పారు.మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వాన ముథోల్ నియోజకవర్గం మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేష్, ప్రముఖులు డాక్టర్ కిరణ్ కొమ్రెవార్,పిప్పర కృష్ణ, సిద్ధంవార్ వివేకానంద,మంద లింగన్న,కోర్వ శ్యామ్,తోట రాము,చిమ్మన్ పోశెట్టి,వెన్నెల అనిల్ తదితరులు మంగళవారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రవిచంద్ర,ఎమ్మెల్యే గంగుల కమలాకర్ లతో సమావేశమయ్యారు.ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మాజీ మంత్రి జోగు రామన్నలతో కలిసి రూ.10 లక్షల చెక్కును నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ చైర్మన్ రోళ్ల రమేష్ కు సంఘం ప్రముఖుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా సంఘం వారు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ రవిచంద్ర,కమలాకర్ లను శాలువాలతో సత్కరించారు.

## పిల్లలకు బహుమతులు అందజేసిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



ఆల్విన్ కాలనీ, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): ఆగస్టు 15 సందర్భంగా శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్లోని బేథిల్ గాస్పెల్ చర్చ్ పాస్టర్ గోపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్. జయశంకర్ నగర్. పి జే ఆర్ నగర్. మరియు చుట్టుపక్కల బస్తీల విద్యార్థిని విద్యార్థులకు కాబట్టి .కోకో. రన్నింగ్ .లెమన్ స్పూన్. లాంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పాస్టర్ గోపి ఈ స్లమ్ ఏరియాలో ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతుంటాడని ఆగస్టు 15 సందర్భంగా నిర్వహించిన ఆటలు పోటీల్లో గెలుపొందిన వారికి నా చేతుల మీదుగా బహుమతులు ఇప్పించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇంత మంచి కార్యక్రమం నిర్వహించిన గోపిని అభినందిస్తున్నానన్నారు.

## ప్రశాంత్ నగర్ సబ్-స్టేషన్ అప్‌గ్రేడ్: విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



కూకట్ పల్లి, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): ప్రశాంత్ నగర్ ఐడిఏ, రాజీవ్ గాంధీ నగర్, శ్రీ శ్రీ నగర్ వంటి కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న కరెంటు సమస్యలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. ఈ సమస్యకు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ ఫారూఖీ చొరవతో సుమారు ?2 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులను సోమవారం ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలోని 33/11 కేవీ సబ్-స్టేషన్‌లో కొత్తగా 16 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. డీఈ బోయిన్పల్లి గోపాలరావు ఇచ్చిన సమాచారం మేరకు, ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వల్ల వేలాది మంది ప్రజలకు, వ్యాపార సంస్థలకు నిరంతరాయంగా, స్థిరమైన విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. సబ్-స్టేషన్ అప్‌గ్రేడ్ కార్యక్రమానికి ఎస్ఈ సికింద్రాబాద్- గోపయ్య,ఎస్ఈ స్కాడా సర్కిల్- దిలీప్‌కుమార్, డీఈ బోయిన్పల్లి గోపాలరావు, ఏడిఈ రంగారెడ్డి సతీష్ బాబు, డీఈ లైన్లు, డీఈ ఎంఆర్టీ, ఏడీలు, ఐడీపీఎల్ ఏఈలు, ఇంజనీర్లు, సిబ్బంది హాజరయ్యారు. స్థానిక ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించడంలో ఈ అప్‌గ్రేడ్ ఒక కీలక అడుగు అని ఏఈ అక్బర్ పేర్కొన్నారు.

## అణగారిన వర్గాల పక్షంలోనే పోరాటం- పెన్షన్దారులందరికీ చేయూత,భరోసా ఎమ్మార్పీఎస్

**ప్రభుత్వం పెన్షనర్ల పట్ల చేస్తున్న మోసాన్ని ఎండగట్టడానికే చేయూత పెన్షన్ దార్ల నియోజకవర్గ సదస్సు.**

**పెన్షనర్ల బహిరంగ సభకు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు.**



ధర్మసాగర్, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కురసంపెల్లి కొమురయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన చేయూత పెన్షన్ దార్ల గ్రామ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హనుమకొండ జిల్లా ఇంచార్జ్ కందుకూరి సోమన్న మాదిగ,హనుమకొండ జిల్లా ఎం ఎస్ పి అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ మాట్లాడుతూ అందాల పోటీలకు,భూస్వాములకు రైతుబరోసా,అభివృద్ధి పేరుతో వేలకోట్లు ఖర్చు పెడుతున్నప్పుడు, కాళ్ళు,కళ్ళు,మాట్లాడలేని వికలాంగులకు,వయోవృద్ధులకు, వితంతువులకు,దీర్ఘకాలిక రోగాలతో చావుతో సహవాసం చేస్తున్న కండరాల,రక్తహీనత,ఇతర రోగులకు ఇచ్చిన మాట నెరవేర్చలేదని,పెన్షన్ లు పెంచకుండా అన్యాయం చేస్తున్నారు.పెన్షన్ దారులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.డిసెంబర్లోనే పెన్షన్లు పెంచుతామని హామీఇచ్చి పెన్షన్ డబ్బులను పక్కదారి పట్టించి ద్రోహం చేశారని మండిపడ్డారు. 20 నెలల నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించక తప్పదు అన్నారు. అణగారిన వారి పక్షంలోనే,అందరికీ భరోసానిచ్చే బ్రాండ్ ఎమ్మార్పీఎస్, సంక్షేమ పథకంలో అన్యాయం జరిగితే నిలదీసేది,పోరాటం చేసేది ఎమ్మార్పీఎస్ మాత్రమే అని అన్నారు.పేద వర్గాల పెన్షన్ పెంచని ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎండగట్టడానికే చేయూత పెన్షన్ దార్ల నియోజకవర్గ సదస్సు.ఆగస్టు 28వ తేదీన సిరిపురం గార్డెన్, స్టేషన్గన్పూర్ లో జరగబోయే సభకు, ముఖ్యఅతిథిగా"ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ"పాల్గొనే కార్యక్రమాన్ని చేయూత పెన్షన్దారులందరూ కలిసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో ఎంఎస్పి హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ,గంగారపు వెంకటస్వామి,చేయిత పెన్షన్ దారుల కమిటీ అధ్యక్షులు కళ్ళపల్లి ఐలయ్య ఉపాధ్యక్షులు గంగారపు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఎర్ర సాయిలు, కార్యదర్శి మొగిలిచర్ల మల్లయ్య, సహాయ కార్యదర్శి,ప్రచార కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు పురుష పెల్లి బుచ్చయ్య, ఎర్ర లింగయ్య, గంగారపు అనిలు, గోరంటి లింగయ్య, కురుస పెల్లి సంపత్,జక్కుల లింగయ్య, కురుసపల్లి కొమురయ్య, జక్కుల కవిత, మొగిలిచర్ల రాజమ్మ, కొలిపాక ఉపేంద్ర పిట్టల రజిత గోనెల కల్పన పురుష పెల్లి ఎల్లమ్మ మూడెం రాజమ్మ గంగారపు లక్ష్మి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి :సిఐ కరుణాకర్ రావు



వరంగల్ , 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): వరంగల్ జిల్లా మట్టెవాడ సిఐ కరుణాకర్ రావు.సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.మంగళవారం మున్సిపాలిటీ,పోలీస్ స్టేషన్ లో ఒక ప్రకటనలో తెలిపారు సైబర్ నేరాలపై నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సిఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తామన్నారు,ప్రస్తుతం సైబర్ దుండగులు ప్రముఖ మొబైల్ అప్లికేషన్ల ఏపీకే ఫైల్స్ పేరుతో వైరస్,మాల్వేర్‌ను ఇన్‌స్టాల్ చేయించి,బ్యాంకింగ్ వివరాలు,యూపీఐ పిన్, వ్యక్తిగత సమాచారం దొంగిలిస్తున్నారు. ఏపీకే ద్వారా బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతున్నాయని ఇప్పుడు ఎక్కువగా 07 ఏపీకే మోసాలు జరుగుతున్నాయన్నారు.గ్యాస్ కనెక్షన్ ఏపీకే మోసయనకిలీ గ్యాస్ యాప్ ద్వారా డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆన్‌లైన్ కార్ రెంటల్ ఏపీకే మోసం%-%కార్ బుకింగ్/అద్దె పేరుతో ముందస్తు చెల్లింపు మోసాలు జరుగుతున్నాయి. ఈసిమ్ యాక్టివేషన్ ఏపీకే మోసయనకిలీ యాప్ ద్వారా మీ గుర్తింపు,మొబైల్ నంబర్ యాక్సెస్.హాస్పిటల్ అపాయింట్‌మెంట్ ఏపీకే మోసం-అపాయింట్‌మెంట్ పేరుతో డేటా దొంగతనం, చెల్లింపు మోసాలు ఇవేకాక బ్యాంకింగ్ ఏపీకే మోసయబ్యాంకింగ్ యాప్‌ల పేరుతో యూపీఐ/నెట్ బ్యాంకింగ్ సమాచారం దొంగతనాలకు,దోపిడీ,కి పాల్పడుతున్నారు, వివాహ ఆహ్వాన ఏపీకే మోసయవివాహ ఆహ్వానం పేరుతో పంపబడిన లింక్ క్లిక్ చేస్తే మొబైల్ హ్యాక్ అవుతుందన్నారు,కొత్తగా ట్రెండులోకి ట్రాఫిక్ చలాన్/వాహన్ పరివాహన్ ఏపీకే మోసం నకిలీ చలాన్ యాప్‌ల ద్వారా డబ్బు మోసంతో సైబర్ నేరగాళ్లు,చలామణి అవుతున్నారు. ఈనేరగాళ్ల పట్ల ఎలా జాగ్రత్త పడాలి? ,తెలియని లింక్/వాట్సాప్/ఈమెయిల్ నుండి ఏపీకే డౌన్‌లోడ్ చేయవద్దు. ,గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ యాప్ స్టోర్ ల నుండి మాత్రమే యాప్ ఇన్‌స్టాల్ చేయండి. ,ఏదైనా లింక్‌పై క్లిక్ చేసే ముందు యుఆర్ఎల్ ని పరిశీలించండి.,బ్యాంక్, గ్యాస్, ఆసుపత్రి, ప్రభుత్వం సంబంధిత పనులు అధికారిక వెబ్‌సైట్/యాప్‌లో మాత్రమే చేయండి.,మొబైల్‌లో యాంటీవైరస్,భద్రతా అప్డేట్స్ తప్పనిసరిగా ఉంచండి.మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయండి లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చెయ్యాలని సీఐ కరుణాకర్ అన్నారు.

## అంగన్వాడి సెంటర్లో గ్యాస్ సిలిండర్ మాయం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



నర్సింహులపేట, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): అంగన్‌వాడీ సెంటర్‌లో గ్యాస్ సిలిండర్ మాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. నర్సింహులపేట మండలం లోని రామన్నగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో 2, లోపిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ సిలిండర్ ఏర్పాటు చేశారు. ఈ మధ్యకాలంలో అంగన్‌వాడీలోని ఆయా వయోభారంతో విధుల నుంచి వైదొలిగారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ సెంటర్లో ఉన్న సిలిండర్ ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అయితే ఆయనే సిలిండర్ అపహరించారని పోలీస్ స్టేషన్లో అంగన్వాడి టీచర్ ఫిర్యాదు చేశారు అనంతరం అంగన్వాడీ టీచర్ ఉపేంద్ర మాట్లాడుతూ 22 23 తేదీలలో తాను సెలవు పెట్టినాని తిరిగి 24 తారీఖునఅంగన్వాడి కేంద్రం వచ్చి తలుపులు తీయడంతో అంగన్వాడి సెంటర్ లో సిలిండర్ లేకపోవడంతో అంగనవాడి సూపర్వైజర్ తెలియజేసినట్లు ఆమె తెలిపారు ఈనెల 25వ తారీఖున పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు అనంతరం రామన్నగూడ గ్రామంలో అంగన్వాడి సెంటర్లో సిలిండర్ మాయమైన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు

## శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు



వేలేరు, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లీకుదుర్ల గ్రామంలోని శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు నిర్వహించారు.ఈకార్యక్రమాన్ని సహాయ కమిషనర్ కార్యాలయం పరిశీలకులు డి.అనిల్ కుమార్, వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, దేవాలయ ఒగ్గు పూజారులు, అర్చకులు, సిబ్బంది లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. 2025 జూన్ 10వ తేదీ నుండి ఆగస్టు 26వ తేదీ వరకు మొత్తం 75 రోజుల ఆదాయాన్ని లెక్కించారు. వివిధ అర్జిత సేవా టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయం: రూ.1,75,467.హుండీ ద్వారా వచ్చిన ఆదాయం: రూ.73,163.మొత్తం ఆదాయం:రూ.2,48,630 గా నమోదైనట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి అద్దంకి నాగేశ్వరరావు తెలిపారు.

## పేద ప్రజలపై భారంగా మారిన అధిక ఆస్తిపన్ను - ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



కుత్బుల్లాపూర్, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): నియోజకవర్గ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్, కుత్బుల్లాపూర్ - గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌లను కలుసుకుని, పేద ప్రజలపై అధిక ఆస్తిపన్ను రూపంలో ఆర్థిక భారాన్ని మోపవద్దని విజ్ఞప్తి చేశారు. జంట సర్కిళ్ల పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్ వంటి బస్తీలు, స్లమ్ములు, 60 గజాల గృహవాసాలు ఉన్న పేదవారు నివసించే ప్రాంతాల్లో గత మూడు సంవత్సరాల ఆస్తిపన్ను వసూళ్లు విధించిన పెనాల్టీలను రద్దు చేయాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. ఎన్‌టిఆర్ నగర్ వంటి కాలనీల్లో ఇళ్లు చాలాకాలం క్రితమే నిర్మించబడ్డాయని, ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న వారు పేద ప్రజలని ఆయన గుర్తుచేశారు. ఇలాంటి పేద ప్రజలపై అధిక ఆస్తిపన్ను పెనాల్టీల రూపంలో భారాన్ని మోపడం అన్యాయం అని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని వెంటనే తగిన చర్యలు తీసుకుని, అధిక ఆస్తిపన్ను పెనాల్టీలను మాఫీ చేయాలని డిప్యూటీ కమిషనర్‌లను ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా ఈ సమస్యపై న్యాయం జరిగేలా జీ.హెచ్.ఎం.సి కమిషనర్ శ్రీ కర్ణన్ తో ఫోన్ ద్వారా మాట్లాడి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు కొలుకుల జగన్, విజయ్ శేఖర్ గౌడ్, మంత్రి సత్యనారాయణ, సీనియర్ నాయకులు మహమ్మద్ రఫీక్, మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, మన్నె బాలేష్, సత్తి రెడ్డి, సిద్ధికి, గుబ్బాల లక్ష్మీనారాయణ, ఎన్‌టిఆర్ నగర్ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు..

# వినాయక చవితి – భక్తి, జ్ఞానం, ఐక్యతకు ప్రతీక



భారతదేశం పండుగల దేశం. ప్రతి పండుగ ఒక విశిష్టమైన భావన, ఆధ్యాత్మికత, సామాజిక ఐక్యతను ప్రతిబింబిస్తుంది. వినాయక చవితి లేదా గణేశ చతుర్థి అటువంటి పండుగలలో అత్యంత వైభవంగా జరుపుకునేదిగా నిలుస్తుంది. భాద్రపద శుద్ధ చవితినాడు (ఆగస్టు–సెప్టెంబర్ మధ్య) జరిగే ఈ పండుగకు ఆరంభం శతాబ్దాల క్రితమే జరిగింది. కానీ నేటికీ ఈ పండుగ అదే ఉత్సాహం, అదే భక్తితో కొనసాగుతోంది అని చెప్పడంలో అతిషేయోక్తి కాదేమో!!.

పురాణాల్లో గణేశుడు

గణేశుడి జననానికి అనేక పురాణ కథలు ఉన్నాయి.

1. శివపార్వతుల కథ – పార్వతీమాత పసుపుతో ఒక బాలుడిని సృష్టించి, అతనిని ద్వారపాలకుడిగా ఉంచింది. శివుడు వచ్చినప్పుడు ఆ బాలుడు అడ్డుకోవడంతో అతని తలను నరికి వేశాడు. తర్వాత ఏనుగు తల అమర్చడంతో అతడు గజాననుడయ్యాడు.
2. బ్రహ్మ కథనం – గణపతి బ్రహ్మ యొక్క మనస్పుత్రుడని, ఆయనను లోకంలోని విఘ్నాలను తొలగించడానికి సృష్టించారని ఒక వాదన ఉంది.
3. శివుని ఆశీస్సులు – గణేశుడికి "మొదట పూజించబడే దేవుడు" అనే వర్ణన శివుడు ఇచ్చాడు. అందుకే ఏ శుభకార్యమూ గణపతి వందనంతోనే ప్రారంభమవుతుంది.

ఈ పురాణ గాథలు గణేశుడి ప్రాముఖ్యతను, ఆయన స్థానాన్ని హిందూ మతంలో అత్యున్నతంగా నిలబెడతాయి.

గణేశుడి రూపంలో ప్రతీకాత్మకత: ఏనుగు తల – మహాజ్ఞానం, బలము, వివేకం. పెద్ద చెవులు – అందరి మాటలు వినడం, సహనం. చిన్న కళ్ళు – ఏకాగ్రత, దృష్టి. పొట్ట – సుఖదుఃఖాలను జీర్ణించగల శక్తి. నాలుగు చేతులు – శక్తి, జ్ఞానం, సమృద్ధి, ధర్మం. తొండం – సౌలభ్యం, అనుకూలత. ఎలుక వాహనం – అతి చిన్నదైనదీ గొప్ప పనులు చేయగలదని సూచన. ఇది మొత్తం మానవజీవితానికి ఒక తత్వబోధ.

పూజా విధానాలు:

వినాయక చవితి రోజున ఉదయమే గణపతి ప్రతిష్ఠ జరిపి పూజలు చేస్తారు. ముఖ్యమైన అంశాలు: వ్రతం – ఉపవాసం, నియమాచరణ. విగ్రహ ప్రతిష్ట – మట్టి విగ్రహం లేదా పర్యావరణ స్నేహపూర్వక గణపతి. పూజా ద్రవ్యాలు – పసుపు, కుంకుమ, కొబ్బరి, దుర్వా గడ్డి, పుష్పాలు. నైవేద్యం – మోదకాలు (ఉండ్రాళ్లు), పులిహోర, పాయసం, లడ్డూలు. మంత్రపఠనం – గణపతి అష్టోత్తర శతనామావళి, గణపతి అథర్వశీర్షం, వక్రతుండ మహాకాయ స్తోత్రం. పండుగ వైభవం – ఇంటి నుండి ఊరంతా గృహోత్సవం – కుటుంబ సభ్యులు కలిసి పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. ప్రజా ఉత్సవాలు – కాలనీలు, వీధులు, పట్టణాలు, నగరాల్లో భారీ గణపతి మండపాలు కట్టి ఉత్సవం నిర్వహిస్తారు. సాంస్కృతిక ప్రదర్శనలు – నృత్యాలు, నాటకాలు, సంగీత కచేరీలు. భక్తి కార్యక్రమాలు – భజనలు, వేదపఠనాలు, హరిదాసులు. నిమజ్జనం – చివరి రోజున గణపతి విగ్రహాన్ని ఊరేగింపుతో నదులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.

ప్రాంతాల వారీగా వినాయక చవితి: మహారాష్ట్ర – అత్యంత వైభవంగా గణేశోత్సవం జరుపుకునే రాష్ట్రం. ముంబైలో లాల్‌బాగ్‌చా రాజా విగ్రహం ప్రసిద్ధి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ – హైదరాబాద్ ఖైరతాబాద్ గణపతి ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహాలలో ఒకటి. కర్ణాటక – బెంగళూరులో పెద్ద ఎత్తున ఉత్సవం. గోవా, తమిళనాడు, ఒడిశా – గణపతి ఆరాధన సాంప్రదాయపూర్వకంగా జరుగుతుంది. ఉత్తర భారతదేశం– అక్కడి హిందూ కుటుంబాలలో గృహపూజలకు ప్రాధాన్యం.

చారిత్రక ప్రాధాన్యం:

లోకమాన్య బాల గంగాధర్ తిలక్ గణేశోత్సవాన్ని 1893లో స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ప్రజా స్థాయిలో ప్రారంభించారు. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఒకచోట కూడలేని పరిస్థితి ఉండేది. కానీ పండుగ పేరుతో పెద్దఎత్తున సమావేశాలు జరిపి దేశభక్తిని పెంపొందించారు. గణేశ మండపాలు జాతీయోద్యమానికి కేంద్రాలయ్యాయి. ఇది గణేశోత్సవానికి ఒక కొత్త సామాజిక, రాజకీయ కోణాన్ని తెచ్చింది. నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో గణేష్ ఉత్సవలు కూడా భాగం.

ప్రకృతి పరిరక్షణే... పండుగ పరమార్థం:

వినాయకచవితి అనేక సందేశాల్ని మానవాళికి పంచే పండుగ. ప్రకృతిపరంగా మనకు స్పష్టమైన సందేశాన్ని ఈ పండుగ ఇస్తుంది. కొన్ని పండుగలు భక్తిశ్రద్ధలతో ఇంటికి మాత్రమే పరిమితమై జరుపుకుంటారు. అయితే, సామాజికంగా అందరూ కలిసిచేసుకునే అతికొద్ది పండుగల్లో వినాయకచవితి అతిముఖ్యమైంది.

ప్రకృతిమాత అంటే పార్వతీదేవి కుమారుడు వినాయకుడు. ప్రకృతిమాత దివ్యశరీరానికి నలుగుపెట్టిన ఓషధులమయమైన నలుగుపిండితో ప్రాణంపోయించుకున్న దేవుడు వినాయకుడు. పంటల్ని చెరగడానికి చేటలు వాడతారు. ఆ చేటలంత చెవులు, బాగా పండితే పెద్దగా అని చెప్పటానికి గజపంట పండింది అంటారు. బాగా పంట పండినందుకు చిహ్నంగా వినాయకుడు గజతలను ధరించాడు. పండిన పంటల్ని పెద్ద పెద్ద గాదెలలో దాచుకుంటారు. ఆ గాదెల వలే పెద్దశరీరం కలవాడు. ఏకదంతం నాగలికి చిహ్నంగా నిలిచింది. ఉండ్రాళ్లు, కుడుములు, పంట వచ్చిన క్రొత్తలో భగవంతునికి నైవేద్యం పెడుతున్నాం. ధాన్యపు గాదెలకు చుట్టూ గడ్డితో పేలిన త్రాడును చుడతారు. ఈ లంబోదరుని ఉదరం చుట్టూ నాగపాశం బంధించి ఉంటుంది. గణేశ నిమజ్జనం చేసి అక్కడి మట్టిని కొద్దిగా తెచ్చుకుని ధాన్యపు గాదెల్లో, పంటపొలాల్లో, దుకాణాల్లో రైతులు వ్యాపారస్తులు, చల్లుకుంటారు. వినాయకుడు పంటలకు, ప్రకృతికి ప్రతిరూపంగా ఆరాధించబడుతున్నాడు. వర్షాకాలం ప్రారంభమై చెట్లకు చిగురులు పట్టి పర్యావరణం ఆకుపచ్చచీర కట్టుకున్నట్లు ఉండేకాలంలో ఈ పండుగ వస్తుంది. వేసవికాలం మండుటెండకు బోసిపోయినట్లుండే చెట్లు చిగురులువేసి కొత్త లేతాకుపచ్చతో కళకళలాడుతుంటాయి.

వినాయకచవితి అటు వ్యవసాయరంగానికి, ఇటు ప్రకృతి పరిరక్షణకు ఉపయోగపడే విధంగా మన పూర్వీకులు తీర్చిదిద్దారు. తొలకరివర్షాలతో చెరువులు, కుంటల్లో నేల తడిగా మారుతుంది. ఆ మట్టిని గ్రామస్తులు తీసుకువచ్చి వినాయకుడి ప్రతిమలు చేసి పూజలు చేస్తారు. దీంతో మొత్తం గ్రామం తమ సమీపంలోని చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ప్రతికుటుంబం ఎంతో కొంతమట్టి తవ్వి ఇంటికి తీసుకువెళ్లేవారు. ఇది కాకుండా ప్రతి ఊర్లో వీధుల్లో యువకులు భారీమొత్తంలో మట్టిని పోగుచేసి పెద్ద పెద్ద వినాయకవిగ్రహాలు ప్రతిష్ఠించేవారు. దీంతో చెరువుల్లో పూడికను ఎవరికి వారు తీసేసి నీరు నిల్వ ఉండడానికి ఆయా చెరువులకు జీవం పోసేవారు. వినాయకుడిని పత్రితో పూజిస్తారు కనుక వివిధరకాల చెట్ల నుంచి ఆకుల్ని కోసి ఇంటికి తెచ్చుకునేవారు. దీనివల్ల కొత్త ఆకులు మళ్లీ చిగురించి చెట్టుకు జీవకళ వచ్చేది. కాలం మారుతుండటం, లేత ఆకులు ఉండటంతో చీడపరుగులు ఆకులకు పట్టేవి. ఈ సమయంలో ఆకులను తెంపుకోవడం వల్ల చీడపురుగుల నుంచి చెట్లకు విముక్తి లభించేది. దీనివల్ల భాద్రపద, ఆశ్వయుజమాసాల్లో కురిసే వర్షాలకు చెట్లు మరింత ఏపుగా పెరిగి పర్యావరణాన్ని సమతుల్యం చేసే అవకాశం కలుగుతుంది.

తొమ్మిదిరోజుల పాటు వినాయకుడి పూజలు ముగించి అందరూ కలిసి వినాయకప్రతిమల్ని సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేసేవారు. దీనివల్ల చెరువుల్లో మట్టి పునరుపయోగానికి అనువు అయ్యేది. చెరువుగట్లు పటిష్టంగా మారేందుకు అవకాశం కలిగేది. వినాయకుడిని పూజించిన పత్రి చెరువుల్లో వేయడం వల్ల ఆయా ఆకుల నుంచి వచ్చే రసాలు ప్రకృతిపరంగా నీటికి కొన్ని ఔషధగుణాల్ని కల్పించేవి. నీటిలో కరిగిన ఈ ఆకులపసరు, రసాలు నీటిని శుద్ధిచేయడంతో పాటు వ్యవసాయానికి ఉపయోగించే నీటికి కొత్తశక్తిని ఇస్తాయి. ఇవన్నీ ఒకప్పటి విషయాలు. ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణం వినాయకచవితి రోజున కన్పిస్తోంది. విగ్రహాలను ఎత్తుపెంచడం కోసం మట్టికి బదులు పర్యావరణానికి హాని కలిగించే కృత్రిమ మృత్తికను(ప్లాస్టర్ ఆఫ్ పారిస్) ఉపయోగిస్తున్నారు. ఇది మంచిదికాదు. అదేవిధంగా విగ్రహాలు ఆకర్షణీయంగా కన్పించేందుకు ప్రమాదకారులుగా ఉండే రంగులను వాడుతున్నారు. వీటి స్థానంలో సంప్రదాయ బద్ధమైన రంగులను ఉపయోగించేందుకు ప్రయత్నించాలి. పర్యావరణ పరిరక్షణదిశగా మన ఆలోచనలు ఉండాలి. ఇది అతిసున్నితమైన విషయం గనుక మనలోనే మార్పులు రావాలి. వినాయకుడు భక్తులనుంచి కోరుకునే పర్యావరణానికి చేరువుగా ఉంటూ భక్తిశ్రద్ధలతో పూజలు చేసి గణేశుని ఆశీస్సులు పొందడంతో పాటు భావితరాలకు ప్రకృతిఫలాలు సజావుగా అందించడానికి ప్రతి ఒక్కరూ ఆలోచించాలని ఆకాంక్ష!!

పరిష్కార మార్గాలు: మట్టి విగ్రహాలు వాడటం. సహజ రంగులు, పూలతో అలంకరించడం. విత్తన గణపతి – నిమజ్జనం తర్వాత మొక్కలుగా పెరిగే విధంగా రూపొందించబడినవి. ఇంట్లోనే బకెట్ నిమజ్జనం చేసి పర్యావరణాన్ని కాపాడడం.

ఉండ్రాళ్లు –మోదకాలు–ఆయుర్వేదం

వినాయకచవితి రోజున సూర్యోదయానికి ముందు తూర్పున ఎలుక ఆకారం, దానిమీద ఏనుగు ఆకారం గల నక్షత్రాల గుంపు ఉదయిస్తుందని, సూర్యోదయానికి ముందు ఏ నక్షత్రం ఉదయిస్తుందో ఆ నక్షత్రానికి సంబంధించిన దైవాన్ని పూజించాలి. కాబట్టి, భాద్రపదశుద్ధచవితినాడు వినాయకచవితి జరుపుతున్నారు.

ఒక్కో దేవుడికి ఒక్కో పూజావిధానం ఉన్నట్టే ఒక్కోవిధమైన నైవేద్యం కూడా ఉంటుంది. వినాయకుడికి కుడుములు, ఉండ్రాళ్లు లేదా మోదకాలు ఇష్టమైనవిగా భావించి నైవేద్యం పెడ్తుంటాం.

పరమేశ్వరుడి మెడలో కపాలాల్ని చూసి ఉండ్రాళ్లు అను కుని తొండంతో లాగుతున్న బాలవినాయకుడు తనను రక్షించాలని కూచిమంచి తిమ్మకవి వినాయకస్తుతి చేశాడు. బ్రహ్మదేవుడు చేసిన ఒక చిన్నతప్పువల్ల ఆయన ఐదో ముఖం ఊడిపోయి, శివుని చేతిలో కపాలంగా చేరిందని అదే శివుడి భిక్షాపాత్రగా మారిందనీ, ఈ కపాలం శిలామయశివలింగ రూపంగా వెలిసిన క్షేత్రమే బ్రహ్మ కపాలం అయ్యిందనీ చెప్తారు. చనిపోయిన వారి కపాలాలను శివుడు మెడలో ధరిస్తాడని ఒక నమ్మకం. మరణించినా శివుడి మెడలో మాలగా ఉండటమే కపాలం రహస్యం అంటారు పెద్దలు.

తిరుమల రామచంద్ర గుండ్రంగా ఉండేవి ఉండ్రాళ్లని, కొంచెం పొడవుగా ఉండేవి మోదకాలని భావించారు. మోదకాల కోసం 'అచ్చు'లు కూడా బజార్లో దొరుకుతాయి. బియ్యప్పిండి ముద్దని ఈ అచ్చులో నింపి, వేలితో గుంటలా చేసి, అందులో తీపిలౌజు

కూరిన మోదకాలను ఆవిరిమీద ఉడికిస్తారు. మోదాన్ని అంటే సంతోషాన్నిస్తాయని ఇలా పిలిచి ఉంటారు. తెలుగువాళ్లలో చాలామంది ఉండ్రాళ్లని కూడా జిల్లేడు కాయల పేరుతో అదే ఆకారంలో లోపల తీపిలౌజు పెట్టి తయారు చేస్తుంటారు ఈనాటికీ!

చరకసంహిత సూత్ర స్థానం (159) ప్రకారం కంది, మినప, పెసరలాంటి పప్పుదినుసుల పిండిని గానీ వరి, గోధుమ, యవలు (బార్లీ) లాంటి ధాన్యాలపిండిని ఉండ్రాళ్లుగా చేసి ఆవిరిమీద ఉడికిస్తే వాటి గుణాలలో మార్పు ఉండదని దీని భావం.

ప్రెషరకుక్కర్లో వండటం కూడా ఆవిరిమీద ఉడికించటమే కదా అని మీరడగవచ్చు. నేరుగా ఆవిరి మీద ఉడకటం వలన చరకుడు చెప్పిన గుణధర్మాలు ఏవీ మారవు కానీ, గట్టిగా మూత బిగించి లోపల ఆవిరితో వత్తిడి కలిగించి అధిక ఉష్ణోగ్రత మీద వండితే ఆ వండిన పదార్థపు గుణధర్మాలు హానికరంగా మారిపోయే ప్రమాదం ఉంది. అధిక ఉష్ణోగ్రతతో వండితే అందులో 'ఏక్రిలమైడ్' అనే విషపూరిత రసాయనం పుడుతుంది. అదే క్యాన్సర్ లాంటి వ్యాధులకు కారణం అవుతుంది. ఒక గిన్నెలో నీళ్లు పోసి ఆ గిన్నె మూతికి ఒక గుడ్డకట్టి ఆ గుడ్డ మీద ఉండ్రాళ్లు ఉంచి మూతపెట్టి, తగినంత వేడిమీద వండితే ఆ ఉండ్రాళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. రుచికరం, పుష్టికరం. ఆకలి తీరుతుంది. జీర్ణశక్తి ననుసరించి తింటే మేలు చేస్తాయి. అజీర్తిగా ఉన్నవాళ్లు అతిగా తింటే కఫాన్ని వాతాన్ని పెంచుతాయి. బియ్యపురవ్వ, జీలకర్ర కలిపి ఉండ్రాళ్లు చేసు కోవటం, పుదీనా పచ్చడి నంజుకుని తినటం, నెయ్యి వేసుకుని, బెల్లం ముక్క కొరుక్కుంటూ తినటం, లేదా బెల్లపు లౌజును లోపల ఉంచి చేసే జిల్లేడుకాయల్లాంటి మోదకాలను తినటం మంచిది. ఉప్పు లేకుండా చప్పిడిగా చిన్నచిన్న ఉండ్రాళ్లను చేసి, ఆవిరి మీద ఉడికించి పాలలో వేసి పాయసం కాస్తారు. ఇది ఒక విధమైన పాలతారికల లాంటి వంటకం. వేడి తగ్గిస్తుంది. ఎసిడిటీతో బాధపడే వారికి మంచిది. చాలా బలకరమైంది.

తీవ్రమైన వేసవి తాకిడి తరువాత తొలకరి జల్లులు ప్రారంభమయ్యాక వినాయకచవితి వస్తుంది. కాలే పెనం మీద నీళ్లు పడితే ఒక్కసారిగా వేడి ఆవిర్లు వచ్చినట్టు మన శరీరంలో కూడా వేడి పెరిగే కాలం ఇది. ఈ సీజన్లో ఉండ్రాళ్ల లాంటివి చలవ నిస్తాయి. జీర్ణశక్తిని చంపే టిఫిన్లకన్నా ఇవి మేలు చేసేవిగా ఉంటాయి. ఆయా ఋతుధర్మాల ననుసరించి ఆహార అలవాట్లలో ఎలాంటి మార్పులు చేసుకోవాలో మన పండుగలు మనకు గుర్తు చేస్తుంటాయి.


ఆరోగ్యస్పృహ ముఖ్యం కదా!

సామాజిక, సాంస్కృతిక ప్రాధాన్యం:

వర్గ, మత, భాష తేడాలు లేకుండా ప్రజలు కలిసిపోతారు. పిల్లల్లో సృజనాత్మకత, ఐక్యత, భక్తి పెంపొందుతుంది. సమాజంలో సేవా కార్యక్రమాలకు వేదిక అవుతుంది. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతుంది.

ఆధునిక కాలంలో వినాయక చవితి.

ఇప్పుడు వినాయక చవితి టెక్నాలజీ, సోషల్ మీడియాతో మరింత విస్తృతమైంది. ఆన్‌లైన్ పూజలు, లైవ్ ప్రసారాలు. వర్చువల్ గణేశ విగ్రహాలు. పచ్చదనం కోసం పర్యావరణ హిత ఉత్సవాలు. స్మార్ట్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ కంట్రోల్ కోసం టెక్నాలజీ వినియోగం.



హేమంత్ జోగం

వినాయక చవితి పండుగ కేవలం ఒక ఆధ్యాత్మిక ఆచారం కాదుబీ అది భక్తి, ఐక్యత, జాతీయ చైతన్యం, పర్యావరణ పరిరక్షణ అన్నింటినీ కలిపిన ఒక మహోత్సవం. గణేశుడి రూపం మనకు వివేకం, సహనం, ధైర్యం, జ్ఞానం అనే విలువలను గుర్తు చేస్తుంది. ఆయన ఆశీస్సులతో విఘ్నాలు తొలగి విజయమార్గం సుగమమవుతుంది.

మట్టి ప్రతిమలను పూజిద్దాం– ప్రకృతిని కాపాడుకుందాం

"వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభా విఘ్నం నశ్యతి దేవేశ సర్వకార్యేషు సర్వదా"

## 25వ డివిజన్ లోఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ చేసిన,కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకట్.



ఖమ్మం, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ మరియు మున్సిపల్ కమిషనర్ సూచన మేరకు 24వ డివిజన్ కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకట్ ఆధ్వర్యంలో, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసారు. 45 రోజుల లోపు ఇంటి నిర్మాణము పనిని మొదలు పెట్టి, సంవత్సరములోపు ఇంటిని పూర్తి చేసుకోవలని, ఇంటి నిర్మాణము 400 చదరపు అడుగుల విస్తీర్ణము, తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా, ఆర్.సి.సి స్లాబుతో నిర్మించుకోవాలని, రెండు గదులతో పాటు వంట గది, మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించవలని , తదుపరి లబ్దిదారుడు, అనర్హతగా తేలినా, నిభందనలకు విరుద్ధముగా ఇల్లు నిర్మించినట్లు తేలినా, ఇంటి మంజూరును రద్దు చేస్తూ, అప్పటి వరకు చెల్లించిన బిల్లుల మొత్తము ఆర్.ఆర్ చట్ట ప్రకారము తిరిగి వసూలు చేయబడును అని, ఇంటి నిర్మాణమునుకు మంజూరైన రూ.5,00,000 లకు ఈ క్రింద చూపబడిన నిర్మాణ దశలలో లబ్ధిదారునకు బిల్లులు చెల్లింపులు చేయబడును. మొదటి బిల్లు బేస్మెంట్ నిర్మించిన తర్వాత 1,00,000, రెండవ బిల్లు గోడలు కట్టిన తర్వాత 1,00,000 , మూడవ బిల్లు స్లాబు వేసిన తర్వాత 2,00,000 , చివరి బిల్లు ఇంటి నిర్మాణము పూర్తి అయిన తర్వాత 1,00,000 (మరుగుదొడ్డి, ప్లాస్టరింగ్, తలుపులు అమర్చిన తర్వాత) వస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ నీరీష , డివిజన్ నాయకులు, మరియు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రి ఉత్సావాలకు పటిష్టమైన బందోబస్త్

### త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనాలు నడుపుతే కేసులు నమోదు

### పోలీస్ అధికారుల సమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్



ఖమ్మం, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): వినాయక నవరాత్రి ఉత్సావాల సందర్భంగా, ప్రజా భద్రతతో పాటు ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా, అధికారులందరు సమష్టిగా కృషిచేయాలని, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అదేశించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, గణేశ్ విగ్రహాల ప్రతిష్ఠాపన మొదలునిమజ్జనోత్సవం వరకు ఎక్కడ కూడా చిన్న పొరపాటుకు తావు లేకుండా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. ముఖ్యంగా ఉత్సవాల్లో భక్తులకు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలకగకుండా, విధిగా మండపాలను సందర్శించి నియమ నిబంధనలు పాటించేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించడానికి సన్నద్ధమై ఉండాలని అన్నారు. విజుబుల్ పోలీసింగ్ కు తగిన ప్రాధాన్యతను ఇవ్వడంతో రాత్రివేళ్లలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే నేరాలపై డివిజన్ స్థాయి అధికారులు విధిగా సమీక్షించాలని, ఛార్జ్ షీట్లను సకాలంలో దాఖలు చేయడం అలవారుచుకోవాలని, పోలీసు అధికారలకు సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో నేరాల రేటు విశ్లేషణ, శిక్ష విధించే రేట్లను పెంచడం వంటి విషయాలపై అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మహిళలపై, చిన్నారులపై జరిగే నేరాలు, మాదకద్రవ్యాల రవాణాను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రధాన చోరీ కేసుల దర్యాప్తులో పురోగతి, మహిళలు, పిల్లలపై జరిగిన నేరాలు, వ్యవస్థీకృత నేర ముఠాలు మరియు మాదకద్రవ్యాల సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.రహదారుల్లో త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ తో పాటు, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న, వారిపై కేసులను నమోదు చేసి, న్యాయస్థానంలో శిక్షలు పడేలా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీ.సీ.పీ లా అండ్ అర్డర్ ప్రసాద్ రావు,ఏ.సీ.పీ లు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, రహేమన్, రఘు, సాంబరాజు, మహేష్, సర్వర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సూర్య సక్సెస్ హై స్కూల్ విద్యార్థులను అభినందించిన కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకట్



ఖమ్మం, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): సూర్య సక్సెస్ హై స్కూల్ విద్యార్థులచే మట్టి గణపతి విగ్రహల తయారీ పోటీ పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 24వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకట్ పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన విగ్రహాలను పర్యవేక్షించి అభినందించారు . సులభంగా కరిగిపోయే పదార్థాలతో విగ్రహాలు తయారు చేయబడ్డాయి ఈ విగ్రహాలను పూజించిన తర్వాత నిమజ్జనం చేస్తే సులభంగా నీటిలో కరిగిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ స్టాఫ్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏ హార్మోన్ లోపం వల్ల గడ్డం, మీసాలు పెరగవో తెలుసా?



హెల్త్ న్యూస్, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): పురుషులలో గడ్డం, మీసాలు పెరగడం సర్వసాధారణం. 15-16 సంవత్సరాల వయస్సు నుంచి ముఖంపై వెంట్రుకలు పెరగడం ప్రారంభమవుతుంది. కొంతమందికి ఇంతకు ముందే గడ్డం, మీసాలు పెరగడం ప్రారంభమవుతాయి. కానీ కొందరికి ఎక్కువ వయసు ఉన్నప్పటికీ కూడా గడ్డం, మీసాలు పెరగవు. ఈ హార్మోన్ ఈ సమస్యకు కారణమవుతుందంటున్నారు నిపుణులు. ఈ హార్మోన్ ఉత్పత్తి తక్కువగా ఉండటం వల్ల, గడ్డం, మీసాలు తక్కువగా పెరుగుతాయి. గడ్డం, మీసాలు పెరగడానికి ఏ హార్మోన్ కారణమవుతుందో తెలుసా.

పురుషులలో టెస్టోస్టెరాన్ ప్రధాన సెక్స్ హార్మోన్. ఇది గడ్డం, మీసాల పెరుగుదలకు కారణమవుతుంది. ఈ హార్మోన్ ముఖంపై వెంట్రుకల కుదుళ్లను ప్రేరేపిస్తుంది. ఇది జుట్టు పెరుగుదలకు దారితీస్తుంది. టెస్టోస్టెరాన్ స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు, ముఖ వెంట్రుకలు సన్నగా, పల్చగా లేదా పూర్తిగా లేకుండా మారవచ్చు. అదనంగా, టెస్టోస్టెరాన్ ఒక రూపమైన డైహైడ్రోటెస్టోస్టెరాన్ (DHT) కూడా జుట్టు పెరుగుదలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

టెస్టోస్టెరాన్ లోపం అనేక కారణాల వల్ల సంభవించవచ్చు. వీటిలో ఒత్తిడి, సరైన ఆహారం లేకపోవడం, నిద్ర లేకపోవడం, ఊబకాయం, థైరాయిడ్ వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో, జన్యు పరమైన అంశాలు గడ్డం, మీసాల పెరుగుదలను కూడా ప్రభావితం చేస్తుంది. కుటుంబంలో ఇప్పటికే జుట్టు తక్కువగా ఉండటం సమస్య ఉంటే, అది వంశపారంపర్యంగా వస్తుంది. దీనితో పాటు, పిట్యూటరీ గ్రంథి లేదా హార్మోన్ల రుగ్మతలతో సమస్యలు కూడా టెస్టోస్టెరాన్ స్థాయిలను తగ్గిస్తాయి.

టెస్టోస్టెరాన్ హార్మోన్ లోపాన్ని సులభంగా గుర్తించవచ్చు. అలసట, కండరాల బలహీనత, తక్కువ లిబిడో, మానసిక స్థితిలో మార్పులు ఉండవచ్చు. మీ గడ్డం, మీసం పెరగడం లేదని మీరు భావిస్తే, వైద్యుడిని సంప్రదించండి. టెస్టోస్టెరాన్ స్థాయిలను సాధారణ రక్త పరీక్షతో గుర్తించవచ్చు. టెస్టోస్టెరాన్ పెంచుకోవడానికి, ప్రోటీన్, జింక్, విటమిన్ డి కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం హార్మోన్ల స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది. ఒత్తిడిని తగ్గించడానికి యోగా, ధ్యానం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వర్షాకాలంలో పిల్లలకు న్యుమోనియా ఎఫెక్ట్.. జాగ్రత్త సుమీ!



హెల్త్ న్యూస్, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): వర్షాకాలం వచ్చిందంటే జలుబు, దగ్గు, జ్వరాలు, శ్వాస సంబంధిత సమస్యలు ఎక్కువ అవుతాయి. ముఖ్యంగా చిన్నారుల్లో న్యుమోనియా కేసులు ఈ కాలంలో అధికంగా కనిపిస్తాయి. న్యుమోనియా ఒక తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్. దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు కలగవచ్చు. కాబట్టి తల్లిదండ్రులు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం.

వర్షాకాలంలో న్యుమోనియా ఎక్కువగా ఎందుకు వస్తుంది?

వర్షాకాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీని వలన బాక్టీరియా, వైరస్‌లు వేగంగా వ్యాప్తి చెందుతాయి. అలాగే చల్లని వాతావరణం కారణంగా పిల్లల రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. ఇంకా తడిసి వర్షంలో ఆడుకోవడం, తడి బట్టలతో ఉండటం వల్ల శరీరం చల్లబడుతుంది. దీంతో ఇన్ఫెక్షన్లు త్వరగా పట్టేస్తాయి. అలాగే ఇంట్లో గదులు మూసివేసి ఉండటం, గాలి సరిగా ఆడకపోవడం వల్ల వైరస్‌లు ఒకరినుంచి మరొకరికి సులభంగా పాకుతాయి. ఎక్కువ రోజులు తగ్గని జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, లేదా వేగంగా శ్వాస తీసుకోవడం ఇంకా దగ్గు, కఫం, ఆహారం తినకపోవడం, బలహీనత, పెదవులు, గోర్లు నీలిరంగులోకి మారడం (తీవ్ర స్థితి) వంటివి న్యుమోనియా లక్షణాలు పిల్లల్లో కనిపిస్తాయి.

నివారణ ఎలా?

పిల్లలను వర్షంలో తడవకుండా చూసుకోవాలి. తడిసిన వెంటనే పొడి బట్టలు వేసి వేడి పాలు లేదా సూప్ ఇవ్వాలి. ఇంకా ఇమ్యూనిటీ పెంచే ఆహారం బాగా ఇవ్వాలి. ముఖ్యంగా పాలు, గుడ్లు, పండ్లు, కూరగాయలు, పప్పులు ఇవ్వడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. ఇంకా కుదిరితే ముందు జాగ్రత్తగా వాక్సినేషన్ చాలా ముఖ్యం. న్యుమోనియా వ్యాక్సిన్, ఫ్లూ షాట్లు డాక్టర్ సలహా మేరకు వేయించాలి. అలాగే ఇంట్లో గాలి సరిగా ఆడేలా చూడాలి. పిల్లలు ఉండే గదుల్లో తేమ ఎక్కువ కాకుండా జాగ్రత్త పడాలి.

## కిడ్నీలు ఒత్తిడికి గురైనప్పుడు కనిపించే 7 ముఖ్యమైన సంకేతాలు



హెల్త్ న్యూస్, 26 ఆగష్టు (క్రాంతిన్యూస్ ): మన శరీరంలో కిడ్నీలు ఒక అత్యంత ముఖ్యమైన అవయవం. అవి వ్యర్థాలను తొలగించడం, ద్రవాలను సమతుల్యం చేయడం, ఖనిజాలను నియంత్రించడం వంటి కీలక పనులు చేస్తాయి. కానీ కిడ్నీలు ఒత్తిడికి గురైనప్పుడు కనిపించే ప్రారంభ సంకేతాలను మనం తరచూ నిర్లక్ష్యం చేస్తుంటాం. వీటిని పట్టించుకోకపోతే భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. కనుక ఈ సంకేతాలను తొందరగా గుర్తించడం వల్ల కిడ్నీ నష్టాన్ని నివారించవచ్చు. అలాగే కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరి కిడ్నీలు ఒత్తిడికి గురైనప్పుడు కనిపించే 7 హెచ్చరిక లక్షణాలు ఏంటో చూద్దాం.

మూత్రంలో మార్పులు

కిడ్నీల పనితీరు సరిగా లేకపోతే మూత్ర విసర్జనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తాయి. సాధారణం కంటే ఎక్కువ సార్లు లేదా తక్కువసార్లు మూత్రం రావడం,మూత్రం నురుగు గా లేదా బుడగలతో కనిపించడం,మూత్ర విసర్జనలో నొప్పి లేదా ఇబ్బంది కలగడం. ఈ మార్పులు నిరంతరం ఉంటే, కిడ్నీలు ఒత్తిడికి గురవుతున్న సంకేతమై ఉండవచ్చు. ఇలాంటి సందర్భంలో తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలి.

అలసట, బలహీనత

కిడ్నీలు ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయపడే ఎరిత్రో పోయెట్ అనే హార్మోన్ విడుదల చేస్తాయి. ఈ హార్మోన్ స్థాయి తగ్గిపోతే శరీరంలో ఎర్ర రక్త కణాలు తగ్గుతాయి. ఫలితంగా రక్తహీనత (అనీమియా), తరచూ అలసట, బలహీనత అనిపించడం..పని చేయకపోయినా నీరసం, శక్తిలేమి ఉంటుంది. ఈ పరిస్థితి కిడ్నీలు సరిగా పనిచేయక పోవడానికి సూచించే ప్రారంభ హెచ్చరిక సంకేతం కావచ్చు.

చేతులు, కాళ్లు, పాదాలు వాపు

కిడ్నీల ప్రధాన పని శరీరంలో ద్రవాలు, ఉప్పును సమతుల్యం చేయడం. కిడ్నీలు సరిగా పని చేయకపోతే ఈ సమతుల్యం కోల్పోతుంది. దీని కారణంగా శరీరంలో అదనపు ద్రవాలు పేరుకుపోతాయి, చేతులు, కాళ్లు, పాదాలు వాపు వస్తుంది. కొన్నిసార్లు ముఖం,కూడా ఉబ్బినట్లుగా అనిపించవచ్చు. ఈ వాపు నిరంతరం ఉంటే, అది కిడ్నీలు ఒత్తిడికి గురవుతున్న స్పష్టమైన సంకేతం. వెంటనే నెఫ్రాలజిస్ట్‌ని సంప్రదించడం అవసరం.

కళ్ల చుట్టూ ఉబ్బరం

కిడ్నీలు సరిగా పని చేయకపోతే, మూత్రం ద్వారా అధిక ప్రోటీన్ బయటకు వెళ్లిపోవచ్చు. ఇది కిడ్నీ దెబ్బ తినడానికి ఇది ఒక ప్రధాన సంకేతం. ఫలితంగా కళ్ల చుట్టూ తరచుగా ఉబ్బినట్లుగా అనిపించడం, ఉదయం లేవగానే కళ్ల కింద పఫ్‌లా కనిపించడం,శరీరంలో ప్రోటీన్ లోపం రావడం.. ఈ లక్షణం క్రమంగా కనిపిస్తే, దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను తొందరగా గుర్తించి చికిత్స పొందవచ్చు.

శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు

కిడ్నీ ఒత్తిడికి గురైనప్పుడు లేదా సరిగా పనిచేయనప్పుడు, శరీరంలో ద్రవం సక్రమంగా బయటకు వెళ్లకపోవడం వల్ల అది ఊపిరితిత్తుల్లో పేరుకుపోతుంది. దీని వల్ల విశ్రాంతిలో ఉన్నప్పటికీ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది. చిన్న పనులు చేసినా ఆయాసంగా అనిపించడం, రక్తహీనత కారణంగా ఆక్సిజన్ సరఫరా తగ్గిపోవడం, ఈ లక్షణం నిరంతరంగా ఉంటే, అది కిడ్నీలతో పాటు హృదయానికి సంబంధించిన సమస్యలు కూడా కావచ్చు. కాబట్టి వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం.

చర్మం పొడిబారడం, దురద

కిడ్నీలు శరీరంలోని వ్యర్థ పదార్థాలను, అదనపు ఖనిజాలను వడపోసి బయటకు పంపుతాయి. అవి సరిగా పనిచేయకపోతే వ్యర్థాలు రక్తంలో పేరుకుపోవడం జరుగుతుంది. దీని వల్ల చర్మం పొడిబారడం, నిరంతర దురద, చర్మంపై మచ్చలు, రాష్‌లు కనిపించడం. దీన్ని నార్మల్ గా తీసుకుంటే, కిడ్నీ సంబంధిత పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం.

వెన్ను లేదా పక్కన నొప్పి

కిడ్నీలు వెన్ను కింద భాగంలో, పక్క వైపున ఉంటాయి. అది దెబ్బతిన్నప్పుడు లేదా ఇన్ఫెక్షన్, రాళ్లు ఏర్పడినప్పుడు వెన్ను లేదా పక్క భాగంలో నొప్పి కలుగుతుంది. దీని కారణంగా కడుపు పక్కలలో లేదా వెన్నుపూస కింది భాగంలో తిమ్మిరి/మందమైన నొప్పి, ఒక్కసారిగా ఎక్కువగా వచ్చే తీవ్రమైన నొప్పి (రాళ్లు కదిలినప్పుడు) వల్ల జ్వరం, వాంతులు కూడా జరుగుతాయి. ఈ నొప్పిని తేలికగా తీసుకోకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యం. కిడ్నీ ఇన్ఫెక్షన్, రాళు లేదా అదనపు ఒత్తిడి కారణంగా వెన్ను/పక్క నొప్పి వస్తుంది.

మీ కిడ్నీలు నిశ్శబ్దంగా పనిచేస్తూ ఆరోగ్యాన్ని కాపాడతాయి. కానీ పైన చెప్పిన లక్షణాలు గమనించిన వెంటనే నెఫ్రాలజిస్ట్‌ను సంప్రదించాలి. సకాలంలో వైద్య సహాయం తీసుకుంటే, కిడ్నీల పనితీరును కాపాడుకోవచ్చు.





## బుమ్రా లేనప్పుడే బౌలింగ్ ఎందుకు బాగా చేస్తానంటే సీక్రెట్ బయటపెట్టిన సిరాజ్




స్పోర్ట్స్ న్యూస్, 26 ఆగస్టు (క్రాంతిన్యూస్ ): ఇటీవల ఇంగ్లాండ్ గడ్డపై భారత స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్ సంచలన ప్రదర్శన చేశాడు. ఏకంగా 23 వికెట్లు తీసి సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ముఖ్యంగా బుమ్రా గైర్హాజరు అయిన రెండు, ఐదు టెస్టుల్లో భారత గెలవడంలో అతనిదే కీలక పాత్ర. ఆ మ్యాచ్‌ల్లో సిరాజ్ బౌలింగ్‌ను ఎంత పొగిడినా తక్కువే. బుమ్రా ఉన్నప్పుడు కంటే లేనప్పుడే సిరాజ్ బౌలింగ్ ప్రదర్శన మెరుగ్గా ఉంటుందని క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతుంటుంది. దీనిపై తాజాగా స్వయంగా సిరాజే స్పందించాడు. 'బాధ్యతను మోసే అవకాశం వచ్చినప్పుడు సాధారణ సిరీస్‌లోనూ నా ప్రదర్శన పెరుగుతుంది. బాధ్యత నాకు భిన్నమైన సంతోషాన్ని ఇస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది.'అని చెప్పాడు. ఇంగ్లాండ్‌లో బుమ్రా గైర్హాజరులో భారత్‌పై విమర్శలు చేసిన వారి నోరు మూయించానని తెలిపాడు.'ఎడ్జ్‌బస్టన్‌లో నా గురించి మాట్లాడుకున్నారు. నేను ఏం చేయగలనో నాకు తెలుసు. వారికి తెలియదు. వారు అతిగా మాట్లాడారు. అందుకు వారి నోళ్లు మూయించడానికి అదే సరైన సమయని భావించా. బుమ్రా వెన్ను గాయం కారణంగా కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అప్పుడు బౌలింగ్ దళంలో సానుకూల వాతావరణాన్ని కొనసాగించడానికి నా వంతు ప్రయత్నం చేస్తా. మనం దీన్ని సాధించగలమనే నమ్మకాన్ని నా సహచర ఆటగాళ్లలో కలిగించడానికి చూస్తా. మనం ఇప్పటికే సాధించిన వాటిని మళ్లీ చేసి చూపించవచ్చని చెబుతా.'అని సిరాజ్ చెప్పుకొచ్చాడు.

నా దూకుడుకు కారణం కోహ్లీనే

మైదానంలో తన దూకుడుకు కారణం విరాట్ కోహ్లీనే అని సిరాజ్ తెలిపాడు. 'ఆర్సీబీలో కోహ్లీతో కలిసి ఉన్నాను. అతనితో నాకు మంచి అనుబంధం ఉంది. ఆటలో పోరాట పటిమను కోహ్లీని చూసే నేర్చుకున్నా. మైదానంలో ప్రత్యర్థులను శత్రువుల్లా.. బయట స్నేహితుల్లా చూడాలనే అతని తీరు నాకు నచ్చింది. నేను దూకుడుగా లేకపోతే బౌలింగ్ బాగా చేయలేను. ఫాస్ట్ బౌలర్లు మైదానంలో దూకుడుగా ఉంటారు. కానీ, వారి కంటే కోహ్లీ దూకుడు ఎక్కువ.'అని సిరాజ్ తెలిపాడు.

## గోల్డ్ మెడల్ కొట్టిన మీరాబాయి చాను!



ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చాను బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. సోమవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకాన్ని అందుకున్నారు. మహిళల 48 కిలోల విభాగంలో మొత్తం 193 కిలోలు (84 కిలోలు, 109 కిలోలు) ఎత్తి మొదటి స్థానంలో నిలిచారు. టోటల్, స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్ రికార్డులను బద్దలు కొట్టారు. స్నాచ్‌లో 84 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలు ఎత్తి మీరాబాయి చాను సత్తాచాటారు.

మీరాబాయి చాను 84 కిలోల తన ప్రారంభ స్నాచ్ ప్రయత్నంలో విఫలమయ్యారు. రెండో ప్రయత్నంలో క్లియర్ చేశారు. 89 కిలోల మూడో ప్రయత్నంలో ఫెయిల్ అయ్యారు. ఆపై క్లీన్ అండ్ జెర్క్‌లో 105 కిలోల బరువును ఎత్తారు. దాన్ని 109 కిలోలకు పెంచింది. 113 కిలోల చివరి ప్రయత్నాన్ని క్లియర్ చేయలేకపోయారు. మలేషియాకు చెందిన ఐరీన్ హెన్రీ 161 కిలోలు (73 కిలోలు, 88 కిలోలు) రజతం, వేల్స్‌కు చెందిన నికోల్ రాబర్ట్స్ 150 కిలోలు ఎత్తి (70 కిలోలు ం 80 కిలోలు) కాంస్యం గెలుచుకున్నారు. అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య వెయిట్ విభాగాలను సవరించిన తర్వాత మీరాబాయి చాను కొత్త 48 కిలోల విభాగంలో పోటీ పడుతున్నారు.

'అహ్మదాబాద్‌లో బంగారు పతకం గెలుచుకోవడం నాకు ఆనందంగా ఉంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఒక సంవత్సరం అనంతరం సొంత గడ్డపై పోటీ పడటం మరింత ప్రత్యేకంగా చేసింది. ప్రేక్షకుల మద్దతు నాకు అపారమైన ప్రేరణనిచ్చింది. ఈ విజయం నా కృషి, నా కోచ్‌ల మార్గదర్శకత్వం, దేశ ప్రజల ప్రోత్సాహం ఫలితంగా వచ్చింది. అక్టోబర్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు నేను సిద్ధమవుతున్నా. ఈ సమయంలో ఈ విజయం నాకు గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. అంతర్జాతీయ వేదికపై భారతదేశం గర్వపడేలా చేయడానికి నా వంతు కృషి చేస్తా' అని ఆమె మీరాబాయి చాను తెలిపారు.

## యువ రెజ్లర్ నేహాపై వేటు.. ఆ కారణంతో రెండేళ్లు సస్పెండ్



స్పోర్ట్స్ న్యూస్, 26 ఆగస్టు (క్రాంతిన్యూస్ ): భారత మహిళా రెజ్లర్ నేహా సాంగ్వాన్‌ను సోమవారం భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యుఎఫ్ఐ) రెండేళ్లు సస్పెండ్ చేసింది. 59 కేజీల కేటగిరీలో పోటీ పడే ఆమె తరుచుగా బరువు నిర్వహణలో విఫలమవుతున్న కారణంగా వేటు వేసింది. అంతేకాకుండా, వచ్చే నెలలో జరిగే సీనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్ స్క్వాడ్ నుంచి కూడా తప్పించింది. ఆమె స్థానంలో సారిక మాలిక్‌ను తీసుకుంది. ఆమె వరల్డ్ చాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో రెండో స్థానంలో నిలిచింది. సెప్టెంబర్ 13 నుంచి 21 వరకు వరల్డ్ చాంపియన్‌షిప్ జరగనుంది. ఇటీవల బల్గేరియాలో జరిగిన అండర్-20 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో నేహా అధిక బరువు కారణంగా డిస్‌క్వాలిఫై అయ్యింది. అర్హత బరువు కంటే 600 గ్రాములు ఎక్కువగా ఉంది. నేహా తరుచుగా బరువు నిర్వహణలో ఇబ్బంది పడుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'బరువు నిర్వహణ రెజ్లర్ చూసుకోవాల్సిన విషయం. బల్గేరియాలో 59 కేజీల కేటగిరీలో మేము పతకాన్ని కోల్పోయాం. మాకు కూడా బాధ్యత ఉంది. టోర్నమెంట్ కోసం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. ఒక్క రెజ్లర్‌పై 2-3 లక్షలు ఖర్చు చేస్తుంది. బరువును చూసుకోకపోతే మరో ఉత్తమమైన రెజ్లర్‌కు అవకాశం ఇస్తాం.'అని డబ్ల్యుఎఫ్ఐ తెలిపింది.

## ఆసియా షూటింగ్‌లో భారత్ హవా గోల్డ్ మెడల్ కొల్లగొట్టిన నీరు



స్పోర్ట్స్ న్యూస్, 26 ఆగస్టు (క్రాంతిన్యూస్ ): కజకిస్థాన్‌లో జరుగుతున్న ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల హవా కొనసాగుతోంది. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరు గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన ఫైనల్‌లో ఆమె 43 స్కోరుతో విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో నీరుకు ఇది రెండో స్వర్ణం. టీమ్ ఈవెంట్‌లోనూ బంగారు పతకం సాధించింది. మరో భారత షూటర్ అష్రేవత్ ఆసిమా 29 స్కోరుతో కాంస్యం గెలిచింది. పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో మెందిరట్ట భౌనీష్ రజతం సాధించాడు. ఫైనల్‌లో అతను 45 స్కోరుతో రెండో స్థానంలో నిలిచాడు. 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో స్టార్ షూటర్ మను భాకర్ పతకం గెలవలేకపోయింది. 25 స్కోరుతో 4వ స్థానంతో సరిపెట్టింది.

ఇక, జూనియర్ విభాగంలో భారత యువ షట్లర్లకు ఎదురులేకుండా పోయింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌ను భారత షూటర్లు క్లీన్‌స్వీప్ చేయడం విశేషం.కుల్దీప్ ఖత్రి పాల్(36) స్వర్ణం గెలువగా.. నామ్య కపూర్(30), తేజస్విని(27) రజతం, కాంస్యం దక్కించుకున్నారు. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో సమీర్, సూరజ్ శర్మ, అభినవ్ చౌదరిలతో కూడిన భారత జట్టు 863 స్కోరుతో గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. పురుషుల, మహిళల ట్రాప్ రెండు ఈవెంట్లలోనూ గోల్డ్ మెడల్స్ భారత్ ఖాతాలోనే రాయి. త్యాగి ఆర్య వన్ష్, అర్జున్, ఉద్దవ్ సింగ్‌లతోకూడిన పురుషుల జట్టు 110 స్కోరుతో విజేతగా నిలిచింది. ఆద్య, భవ్య, సబీరలతో కూడిన మహిళల జట్టు 130-129తో కజకస్థాన్ జట్టును ఓడించి బంగారు పతకం దక్కించుకుంది. దీంతో భారత్ పతకాల సంఖ్య 50కి చేరింది. అందులో 28 గోల్డ్ మెడల్స్ ఉండటం విశేషం. 10 సిల్వర్, 12 బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. మెడల్ టేబుల్‌లో భారత్ అగ్రస్థానంలో ఉండగా.. 28 మెడల్స్‌తో చైనాది రెండో స్థానం.

KR TV క్రాంతి
బుధవారం 27 ఆగస్టు 2025
సినిమా న్యూస్
epaper.krtvnews.com

# శ్రీదేవి ఆస్తులు.. కోర్టును ఆశ్రయించిన బోనీ కపూర్



దివంగత నటి శ్రీదేవి ఫ్యామిలీ వివాదంలో చిక్కుకున్నది. ఆమె భర్త బోనీ కపూర్ మద్రాసు హైకోర్టు ను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ముగ్గురు వ్యక్తులు శ్రీదేవి ఆస్తులపై కన్నేశారు. చట్టవిరుద్ధంగా వారి పేరు మీదకు మార్చుకున్నారు. దీంతో బోనీ కపూర్ కోర్టును ఆశ్రయించారు. ఆ ఆస్తి తమది అని.. శ్రీదేవి ఈ ఆస్తిని 1988 ఏప్రిల్ 19న కొనుగోలు చేసిందని ఆయన కోర్టుకు కపూర్ ఆధారాలు సమర్పించారు. శ్రీదేవి ఎవరి నుంచి అయితే ఆస్తి కొనుగోలు చేసిందో.. ఆ ఫ్యామిలీ నుంచి ఇప్పుడు హక్కుల కోసం ముగ్గురు వ్యక్తులు ముందుకు వచ్చారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాదు.. వారి హక్కును త్వరగా రద్దు చేయాలని కోర్టును కోరారు. దీంతో ఈ ఇష్యూపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్థానిక తాలూకా తహశీల్దార్‌ను హైకోర్టు ఆదేశించారు.

# 'మిరాయ్' విడుదల వాయిదా..

## ట్రైలర్ అప్డేట్ ఇస్తూ పవర్ ఫుల్ పోస్టర్‌తో షాకిచ్చిన మేకర్స్!





టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'మిరాయ్'. యాక్షన్ అడ్వెంచర్‌గా రాబోతున్న ఈ సినిమాకు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులో తేజ సజ్జా సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మంచు మనోజ్, శ్రియ శరణ్, జగపతి బాబు, జయరామ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా పురాణాల ప్రకారం అశోక చక్రవర్తి కళింగ యుద్ధం తర్వాత పశ్చాత్తాపంతో తొమ్మిది పవిత్ర గ్రంథాలను సృష్టించాడు. ఈ గ్రాంథాలను కాపాడే సూపర్ యోధాగా తేజ సజ్జ నటిస్తున్నాడు. అలాగే ఈ గ్రంథాలను దక్కించుకోవడానికి ప్రయత్నించే దుష్టశక్తిగా కనపించనున్నాడు. అయితే తేజ ఎలా మనోజ్‌ను ఎదుర్కొంటాడనేది ఈ మూవీ కథ.

షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న 'మిరాయ్' సెప్టెంబర్ 5న విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పటికే ఇందులోంచి వచ్చిన సాంగ్స్, టీజర్, పోస్టర్స్ అన్ని మంచి రెస్పాన్స్‌ను దక్కించుకోగా.. ట్రైలర్ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలో.. తాజాగా, తేజ సజ్జా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ సంచలన ప్రకటన చేశాడు. 'మిరాయ్' మూవీ ట్రైలర్ ఆగస్టు 28న రాబోతున్నట్లు తెలుపుతూ ఓ పోస్టర్‌ను షేర్ చేశాడు. భవిష్యత్తు యుద్ధం చేసేందుకు వీరిద్దరు జన్మించారంటూ.. మంచు మనోజ్‌తో కర్రతో పోరాటం చేస్తున్న పవర్ పోస్టర్‌ను వదిలాడు. ప్రజెంట్ ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో అంచనాలను రెట్టింపు చేస్తుంది. ఇక ఈ సినిమా సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి రాబోతున్నట్లు ట్రైలర్ అనౌన్స్‌మెంట్‌లో చెప్పి మేకర్స్ అందరికీ బిగ్ షాకిచ్చారు. అయితే సెప్టెంబర్ 5న అనుష్క ఘాటి ఉండటంతో సోలో డేట్‌తోనే రిలీజ్ చేయాలని ఈ చిత్రాన్ని వాయిదా వేసినట్లు మేకర్స్ స్పష్టం చేశారు.

# 'మాస్ జాతర' వాయిదా

## చివరి నిమిషంలో రవితేజ అభిమానులకు బిగ్ షాకిచ్చిన మూవీ మేకర్స్



మాస్ మహారాజా రవితేజ, శ్రీలీలకాంబినేషన్‌లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'మాస్ జాతర'. ఈ సినిమా రవితేజ 75వ ప్రాజెక్ట్‌గా రాబోతుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. భాను బోరవరపు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్స్, సాంగ్స్ ప్రేక్షకుల్లో హైప్ పెంచాయి.

ఇక ఈ మూవీ ఆగస్టు 27న థియేటర్స్‌లోకి రాబోతుందని ఇప్పటికీ మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఎప్పుడెప్పుడు వస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, 'మాస్ జాతర' మూవీ మేకర్స్ చివరి నిమిషంలో రవితేజ అభిమానులకు బిగ్ షాకిచ్చారు. రేపు విడుదల కావట్లేదని ప్రకటించారు. "ఆగస్టు 27న 'మాస్ జాతర'ను విడుదల చేయడం లేదు. సమ్మెలు, కీలకమైన సన్నివేశాలు పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా సినిమాను అనుకున్న తేదీకి సకాలంలో షూటింగ్ ఫినిష్ చేయలేకపోయాము.

కంగారుగా సినిమా రిలీజ్ చేయడం కంటే సమయం తీసుకొని ది బెస్ట్ ఇవ్వాలనుకుంటున్నాము. రవితేజ అభిమానులకు గొప్ప అనుభూతిని అందించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాము. త్వరలో థియేటర్లలో మీకు అతిపెద్ద మాస్ ఫీస్ట్‌ను అందించడానికి బృందం ఎంతగానో కృషి చేస్తోంది. త్వరలోనే కొత్త రిలీజ్ తేదీని ప్రకటిస్తాము" అని రాసుకొచ్చారు. అంతేకాకుండా రవితేజ పోలీస్ డ్రెస్ వేసుకున్న పోస్టర్‌ను షేర్ చేశారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న రవితేజ అభిమానులు షాక్ అవుతున్నారు.

# షాకింగ్ లుక్‌లో దర్శనమిచ్చిన సమంత..

## ప్రశాంతతను ఎంచుకుంటున్నానంటూ పోస్ట్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల నిర్మాతగా కొత్త జర్నీ స్టార్ట్ చేసింది. చాలా రోజుల తర్వాత 'శుభం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరించడంతో పాటు ఇందులో కీలక పాత్రలో నటించి అందరినీ నవ్వించింది. అయితే ఈ చిత్రం ఏప్రిల్ 27న విడుదలై పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. అంతేకాకుండా నిత్యం పలు ఇంటర్వ్యూలో పాల్గొంటూ వార్తల్లో నిలుస్తోంది. అలాగే త్వరలోనే 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక గతంలో లాగా ఒకేసారి 5 చిత్రాలు కాకుండా నాణ్యత కలిగింది ఒక్కటే చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే.

ఎంత బిజీగా ఉన్నప్పటికీ సమంత పలు యాడ్స్, పాడ్‌కాస్ట్ అంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. అంతేకాకుండా పలు హాట్ ఫొటోలు సైతం షేర్ చేస్తోంది. తాజాగా, సమంత కొన్ని హాట్ ఫొటోలు షేర్ చేసింది. ఇందులో బ్లాక్ కలర్ స్లీవ్‌లెస్ ధరించి ఆమె మత్తెక్కించే చూపులతో అందరినీ మెస్మరైజ్ చేస్తుంది. ఈ ఫొటోలకు.. పరిశుభ్రతను ఎంచుకోవడం అంటే.. ప్రశాంతతను ఎంచుకోవడం. శుభ్రంగా ధరించడం అంటే జాగ్రత్తగా ఉండడం" అని ఉన్న కొటేషన్ షేర్ చేసింది. ఇక సమంత ఫొటోలను చూసిన నెటిజన్లు సూపర్ అంటున్నారు. మరికొందరు మాత్రం షాక్ అవుతున్నారు. అసలు సమంతకు ఏమైంది ఇలా మారిపోయిందని ఆందోళన చెందుతున్నారు

Printed, Published and owned by --------------------, Printed at --------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com